Follow: @ANNTELUGU

06-07-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 182 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు



## త్వరలో స్థానిక ఎన్నికలు అన్ని చోట్లా గెలవాల్సిందే

### కుప్పం నుండి సీఎం చంద్రబాబు పిలుపు

**కుప్పం, మహా :** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వాటన్నింటిలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులే గెలవాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు సహా స్థానిక సంస్థలన్నింటినీ కూటమే కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం కార్యకర్తలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, దానికి భంగం కలిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని హితవు పలికారు. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు, మూడో రోజు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలోని

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## బీఆర్ఎస్‌కు మల్లారెడ్డి గుడ్ బై?

"పార్టీకి దూరం కాగానే నన్ను మరిచిపోతున్నారు" అంటూ కార్యకర్త పుట్టినరోజు వేడుకలో వ్యాఖ్యలు



02

## ఒకటి కూల్చితే వంద సంస్థలు కడతాం

- ఫాతిమా కాలేజీ అంశంపై అక్బరుద్దీన్ ఒవైసీ హాట్ కామెంట్స్



02

## ఓవైసీకి భయమేంటో చూపిస్తాం

- బీజేపీ వస్తే కూల్చివేతలు ఖాయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



03

# రేవంత్ లేఖాస్త్రం

- మెట్రో పై భేటీ నిర్ణయాలు అమలుకావట్లే
- కేంద్రమంత్రులు ఖట్టర్, కిషన్ రెడ్డి లకు సీఎం లేఖలు
- ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి



**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి లేఖాస్త్రం సంధించారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయడంతో పాటు, తొలి దశ మెట్రోను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి

మిగతా 3వ పేజీలో



## వారం రోజులు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి

- నీరు అందించి చూపిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన కేటీఆర్ బృందం

# ప్రభుత్వ భూమి @100 కోట్లు


### 22(ఏ)లో ఉన్నా ఆగని అక్రమ నిర్మాణాలు


### కోర్టు పరిధిలో ఉన్నప్పటికి డోంట్ కేర్

ఫిర్యాదు చేసిన పట్టించుకొని వైనం..

రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ

స్పందించాలంటున్న స్థానికులు








**స్పెషల్ టాస్క్ ఫోర్స్ మహా :** శేరిలింగంపల్లి మండలం ఖానామేట్ లో అక్రమ నిర్మాణ దారులు పెట్రేగిపోతున్నారు.. సర్వే నెంబర్ 11/33,11/34లలో సుమారు 4వేల చదరపు గజాలా స్థలాన్ని ఆక్రమించి అడ్డగోలుగా బహుళంతస్తుల నిర్మాణాలు సాగిస్తూన్నప్పటికి అటు రెవెన్యూ , ఇటు టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి... ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు సాగిస్తున్నారంటు కొందరు ప్రభుత్వ అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ వారు స్పందించలేదని..ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడక పోవటంతో వందల కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంత వుతున్నాయని బహిరంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..రంగారెడ్డి జిల్లా, శేరి లింగంపల్లి మండలం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో

మిగతా 2వ పేజీలో



## సీఎం, మంత్రుల చిత్రపటాలకు కంది శ్రీనివాస రెడ్డి పాలాభిషేకం

02

## నీళ్ళు నింపితే పెనుప్రమాదం

- దిగువప్రాంతాల్లోని గ్రామాలు కొట్టుకుపోయే అవకాశం
- మీ తప్పుల వల్లే కాళేశ్వరానికి ఈ దుస్థితి
- మీడియా సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి






## హర్మూజ్ జలసంధిని దాటిన 15 ఎరువుల నౌకలు

02

సరఫరాకు ఎలాంటి ధోకా లేదన్న కేంద్రం









# త్వరలో స్థానిక ఎన్నికలు అన్ని చోట్లా గెలవాల్సిందే

( మొదటి పేజీ తరువాయి )

వాస్తవ పరిస్థితులను అధికారులకు వివరించి, ప్రజా సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ఐదేళ్ల పాలన 201924 రాష్ట్రానికి ఒక పీడకల వంటిదని, ఆ సమయంలో కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతతను దెబ్బతీయాలని నాటి పాలకులు విఫలయత్నం చేశారని చంద్రబాబు విమర్శించారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కుప్పంలో ఎవరైనా రౌడీయిజం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇకపై పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయని, నియామకాల్లో ఎలాంటి మొహమాటాలకు, సిఫారసులకు తావుండదని తేల్చిచెప్పారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమని భరోసా ఇచ్చారు.






## మెల్‌బోర్న్‌లో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా సన్నాహక సమావేశం

- కేటీఆర్ పర్యటన కోసం ఆస్ట్రేలియా ఆసక్తిగా ఎదురుచూస్తోంది
- బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి

**మెల్‌బోర్న్:** బీఆర్ఎస్ ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో త్వరలో చేపట్టనున్న డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మెల్‌బోర్న్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ, డిజిటల్ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆస్ట్రేలియా వ్యాప్తంగా ఘన విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల సిడ్నీ మరియు కాన్బెర్రాలో నిర్వహించిన సమావేశాలకు విశేష స్పందన లభించిందని, అక్కడి కార్యకర్తలు మరియు తెలంగాణ అభిమానుల నుంచి అపూర్వమైన ఆదరణ లభించడం ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని తెలిపారు. బీ ఆర్ ఎస్ నాయకుడు సాయిరామ్ ఉప్పు మాట్లాడుతూబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ప్రతిపాదిత ఆస్ట్రేలియా పర్యటన కోసం ఆస్ట్రేలియా వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, ఈ పర్యటన చారిత్రాత్మకంగా నిలిచేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. కొత్త కమిటీల ఏర్పాటు విషయమై కూడా సమావేశంలో చర్చించారు. వినయ్ సన్నీ చెలుపాటి మాట్లాడుతూ బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చే వరకు ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి చురుకుగా పనిచేయాలని ఆయన ఆహ్వానించారు. ఈ సమావేశంలో ముఖ్య నాయకులు ఉదయ్ సింహారెడ్డి, విశ్వామిత్ర మంత్రిప్రగడ, సూర్యరావు, సతీష్ పులిపాక, రాకేష్, నితీష్ గౌడ్ , సాయిపృథ్వీ , వినోద్ కత్తుల, సునీల్ యాదవ్, రాకేష్ యాదవ్, భాను తేజ్, అజయ్, వివాన్, సంజు రెడ్డి, సుమంత్ , ఉదయ్ రెడ్డి, వెంకట్ రమణ , రామ్ సాయి, సుమంత్, సాయి కృష్ణ, సాయి వంశీ, సాయి కిరణ్,అశ్రీత్, నరేందర్ రెడ్డి, శివ హైదరాబాద్ , తిరుపతి పెద్ది తదితరులు పాల్గొని డిజిటల్ సభ్యత్వ కార్యక్రమం విజయవంతానికి తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.



## బీఆర్ఎస్ కు మల్లారెడ్డి గుడ్ బై?


**హైదరాబాద్, మహా :** "నేను బీఆర్ఎస్ పార్టీకి దూరం కాగానే నన్ను మరిచిపోతున్నారు. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు, పార్టీ కార్యాలయానికి దూరంగా ఉంటున్న మల్లారెడ్డి ఓ కార్యకర్త బర్త్ డే కేక్ కట్ చేయిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మల్లారెడ్డి, ఆయన కోడలు ప్రీతిరెడ్డి, కుమారుడు భద్రారెడ్డి ముగ్గురూ వచ్చే ఎన్నికల్లో పోటీచేయాలని భావిస్తూ బిజెపితో సంప్రదింపులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల మల్లారెడ్డిపై కేసీఆర్ సీరియస్ అయ్యారన్న ప్రచారం నేపథ్యంలో మల్లారెడ్డి వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# ప్రభుత్వ భూమి @100 కోట్లు

( మొదటి పేజీ తరువాయి )


ఖానామెట్ సర్వే నెంబర్ 11/33,11/34 లలో సుమారు 4వేల చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అడ్డగోలుగా బహుళంతస్తుల నిర్మాణాలు సాగిస్తున్నప్పటికి రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవటం బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.. నిషేధిత భూమి ప్రభుత్వ భూములని 22(A) కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ డోంట్ కేర్ అంటూ అక్రమ నిర్మాణ దారులు పెట్రేగిపోతు నిర్మాణాలు సాగిస్తున్నారు ..రు వంద కోట్ల విలువైన ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురవుతుంటే ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరేతినట్లు వ్యవహారించటం పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..


In this connection, the list of immovable properties in respect of Khanamet Village of Serilingampally Mandal, Rangareddy District in the prescribed proformas as communicated in the GO cited are furnished herewith for taking necessary action in the matter.

Yours faithfully
District Collector
Ranga Reddy District.

Copy submitted to the Chief Commissioner of Land Administration, T.S. Hyderabad for favour of kind information.





### టౌన్ ప్లానింగ్ అధికారుల మజాకా

ఖరీదైనా ప్రాంతం హైటెక్ సిటీ.. సుమారు రు 100కోట్ల విలువైనా ప్రభుత్వ భూమిలో జీ హెచ్ ఎం సీ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున బహుళంతస్తుల నిర్మాణాలు..వ్యాపార సముదాయాల కోసం నిర్మిస్తుంటే అడ్డుకొని చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీడుకోవటం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. ఇప్పటికైనా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం పై చర్య తీసుకోని,ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.. అధికారులు స్పందించకుంటే కోర్టు ను ఆశ్రయిస్తామని వారు పేర్కొంటున్నారు.

## సీఎం, మంత్రుల చిత్రపటాలకు కంది శ్రీనివాస రెడ్డి పాలాభిషేకం

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణలో ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులను విడుదల చేసి మాట నిలబెట్టుకుందని ఆదిలాబాద్ కాంగ్రెప్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసారు. సీయం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని అన్నారు. రైతులకు భరోసా నిస్తూ పెట్టుబడి సాయం అందించిందన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు ఎకరానికి 12వేల రూపాయల రైతు భరోసా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ కావడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, మునిగెల విఠల్,దాసరి ఆశన్న, ఎంఎ షకీల్, గడ్డం జగదీష్ రెడ్డి,విఠల్, తదితరులు పాల్గొన్నారు.



# నీళ్ళు నింపితే పెనుప్రమాదం




**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడ్డాయని, ముఖ్యంగా నీటి పారుదల శాఖను తీవ్రంగా దెబ్బతీశారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా అప్పులు చేసి ప్రజలపై భారం మోపడంతో పాటు, ప్రాజెక్టు నిర్మాణంలో లోపాల కారణంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. ఆదివారం సచివాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సుమారు రూ.1.81 లక్షల కోట్లు వ్యయం చేసినప్పటికీ, అందుకు తగిన స్థాయిలో సాగునీటి ప్రయోజనం కల్పించలేకపోయారని మంత్రి అన్నారు. అనేక ప్రాజెక్టులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం ఎక్కువ చేసి పనులు తక్కువ చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖలో లోపాలను సరిదిద్దే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు బయటపడింది కూడా అదే ప్రభుత్వ కాలంలోనేనని మంత్రి గుర్తు చేశారు. దీనిపై ఇంజినీర్లు సమర్పించిన నివేదికలు కూడా నిర్మాణ లోపాలనే సూచిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు సమస్యలకు బాధ్యత వహించాల్సిన వారే ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వెళ్లి పంపులను ప్రారంభించాలని మాజీ మంత్రి కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సక్రమంగా నిర్మించి ఉంటే ఇలాంటి పరిస్థితి తలెత్తేదే కాదని అన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిని పూర్తిస్థాయిలో వినియోగించలేకపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలే కారణమని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో వినియోగించలేకపోవడానికి నాసిరకం నిర్మాణమే కారణమని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునాది నిర్మాణంలో లోపాలు ఉన్నాయని అధికారుల నివేదికలు స్పష్టం చేశాయని చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి నీటి నిపుణులు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టు నిర్వహణపై జాగ్రత్తలు అవసరమని సూచించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టులో భారీగా నీటిని నిల్వ చేసిన సమయంలో నిర్మాణపరమైన సమస్యలు తలెత్తితే దిగువ ప్రాంతాల్లోని అనేక గ్రామాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత దృష్ట్యా నిపుణుల సూచనల మేరకు మాత్రమే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వారం రోజులు ప్రాజెక్టును కేసీఆర్ కు అప్పగించండి

**కాళేశ్వరం, మహా :** ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో భయం మొదలైందని, అందుకే తమ పర్యటనను అడ్డుకుంటోందని విమర్శించారు. లక్ష క్యూసెక్కుల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోతుంటే, ఎగువన ఉన్న మిడ్ మానేరు, కాళేశ్వరం సహా ఏ రిజర్వాయర్‌లోనూ నీరు లేదని అన్నారు. దీంతో రైతులు విత్తనాలు కూడా వేయలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు ఆన్ చేస్తే తెలంగాణ మొత్తం సస్యశ్యామలం అవుతుంది. మాజీ సీఎం కేసీఆర్ ఆ విధంగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రభుత్వానికి చేతకాకపోతే వారం రోజుల పాటు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి, రైతులకు నీరందిస్తాం" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రైతులకు నీళ్లిస్తే యూరియా, మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే సీఎం కావాలనే నీటిని వృథా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని, తమను అడ్డుకోవడం ద్వారా తన అసమర్థతను బయటపెట్టుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో పాటు మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





## ఓవైసీకి భయమేంటో చూపిస్తాం

- బీజేపీ వస్తే కూల్చివేతలు ఖాయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్, మహా :** ఫాతిమా విద్యాసంస్థల అధినేత, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కి భయం ఏమిటో చూపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రాజకీయ అండతోనే ఎంఐఎం నేతలు చట్టాలను, న్యాయస్థానాలను సైతం లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు విచారణలో ఉన్న అంశంపై ఒవైసీ కుటుంబం స్పందిస్తున్న తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాల్‌గా మారిందని విమర్శించారు. చెరువుల పూర్తి నీటిమట్టం పరిధిలో నిర్మాణాలు జరిగాయన్న ఆరోపణలపై హైకోర్టు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, ఎదురుదాడికి దిగడం దారుణమని బండి సంజయ్ అన్నారు. చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే న్యాయవ్యవస్థను ప్రశ్నించేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఎంఐఎం నేతలకు కోర్టులు, చట్టాలపై గౌరవం కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టవిరుద్ధంగా నిర్మించిన భవనాలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఫాతిమా విద్యాసంస్థల నిర్మాణాలు కూడా అక్రమమని తేలితే చట్టప్రకారం కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్టపాలన అంటే ఏమిటో చూపిస్తామని అన్నారు.



## ఒకటి కూల్చితే వంద సంస్థలు కడతాం

**ఫాతిమా కాలేజీ అంశంపై అక్బరుద్దీన్ ఒవైసీ హాట్ కామెంట్స్**

**హైదరాబాద్, మహా** మా విద్యాసంస్థలను కూల్చివేస్తామని అంటున్నారని ఒక సంస్థను కూల్చేస్తే వందల విద్యా సంస్థలు కడతామని చాంద్రయణగుట్ట ఎమ్మెల్యే, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. విద్యాసంస్థలను ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసన్నారు. మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నారని ఇలాంటి బెదిరింపులు గతంలో చాలానే చూశామన్నారు. మీ బెదిరింపులకు మేం లొంగం అని హెచ్చరించారు. మేం అవినీతికి పాల్పడలేదని ఎలాంటి మోసాలు చేయలేదన్నారు. మా విద్యాసంస్థలు ఉన్నా లేకపోయినా విద్యార్థులకు చదువు చెప్పిస్తామన్నారు.

## హర్మూజ్ జలసంధిని దాటిన 15 ఎరువుల నౌకలు

**సరఫరాకు ఎలాంటి ధోకా లేదన్న కేంద్రం**

**హైదరాబాద్,మహా :** సుమారు 15 నుంచి 20 ఎరువుల నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటి భారత్‌కు బయలుదేరాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటిలో ఎనిమిది నౌకలు 3.32 లక్షల టన్నుల యూరియాను, నాలుగు నౌకలు 2.57 లక్షల టన్నుల డీఏపీని, మూడు నౌకలు 1.11 లక్షల టన్నుల సల్ఫర్‌ను తీసుకువస్తున్నాయని పేర్కొంది. మరో ఐదు నౌకలు వీటితో చేరనున్నాయని చెప్పింది. కొంత కాలంగా హర్మూజ్‌లో రవాణాకు అంతరాయం కలిగినప్పటికీ, ఎరువుల లభ్యతకు ఆటంకం లేకుండా చూసుకున్నట్లు కేంద్రం తెలిపింది.



# రేవంత్ లేఖాస్త్రం



( మొదటి పేజీ తరువాయి )
మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి విడివిడిగా లేఖలు రాసి ప్రాజెక్టు పురోగతిపై వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గత నెల 23, 24 తేదీలలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి తన లేఖల్లో ప్రస్తావించారు. మెట్రో తొలి దశ ఆస్తుల విలువ నిర్ధారణ, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ, రెండో దశ విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించే బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ నోడల్ సంస్థ ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించేందుకు అంగీకారం కుదిరిందని గుర్తు చేశారు. అయితే, ఈ ప్రక్రియలో భాగంగా ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాల్సిన విధి విధానాలను ఇప్పటివరకు ఖరారు చేయకపోవడం, అధికారిక నియామకంలో ఆలస్యం చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ జాప్యం కారణంగా మెట్రో తొలి దశ నిర్వహణలో అనిశ్చితి నెలకొనడమే కాకుండా, రెండో దశ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు కూడా ఆలస్యమవుతున్నాయని వివరించారు. ప్రాజెక్టు అమలు మరింత ఆలస్యమైతే నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. హైదరాబాద్ నగర భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే మెట్రో రెండో దశ విస్తరణ అత్యంత కీలకమని, ఇందులో ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయాలు వేగంగా అమలయ్యేలా చూడాలని ఇద్దరు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కోరారు. దీంతో మెట్రో తొలి దశను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ పూర్తవడంతో పాటు, రెండో దశ విస్తరణ పనులకు కూడా వేగం చేకూరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆరోగ్యమే మహా భాగ్యం

**వ్యవసాయ బావిలో ఒక గంట ఈత కొట్టిన మంత్రి జూపల్లి**




**కొల్లాపూర్, మహా :** ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని ఆచరణలో చూపిస్తూ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఫిట్‌నెస్‌పై తనకున్న మక్కువను చాటుకున్నారు. ఆదివారం ఉదయం కొల్లాపూర్ శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బావిలో ఆయన గంటపాటు ఈత కొట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మనిషి సంపాదించే సంపద కంటే ఆరోగ్యమే అతిపెద్ద పెట్టుబడి అని పేర్కొన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో వ్యాయామాన్ని ఒక భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి రోజూ కనీసం గంటపాటు యోగ, ధ్యానం, వాకింగ్, జాగింగ్, రన్నింగ్ లేదా స్విమ్మింగ్ వంటి శారీరక శ్రమతో కూడిన పనులు చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన సూచించారు. వ్యాయామం కేవలం శరీర దారుఢ్యానికే కాకుండా, ఒత్తిడిని దూరం చేసి మానసిక ఉల్లాసాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన చెప్పారు.

# బిఆర్ఎస్ కమీషన్ల కోసం కాళేశ్వరం కడితే మేము పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం

**కన్నెపల్లి పర్యటనలో కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి కౌంటర్**

**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని, నాణ్యతలేని నిర్మాణాలతో తెలంగాణ ప్రజలపై భారాన్ని మోపిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా విమర్శించారు. కన్నెపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమేనని మంత్రి అన్నారు. "పేదలకు ఇళ్లు కడితే కమీషన్లు రావు... కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు కడితేనే కమీషన్లు వస్తాయనే ఆలోచనతో బీఆర్ఎస్ పాలకులు పేదల గృహాల అవసరాన్ని విస్మరించారు. అందుకే నేడు తెలంగాణ ప్రజలు వారిని అధికారానికి దూరం చేశారు" అని మంత్రి వ్యాఖ్యానించారు.
కాళేశ్వరం ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, కమీషన్ల కోసమే నిర్మించడం వల్లే నేడు మరమ్మతుల అవసరం వచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. "అసలు రిపేరు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మీ అవినీతి, మీ కక్కుర్తే దానికి కారణం కాదా? మీరు నాసిరకం నిర్మాణాలు చేసి కూల్చేసి... ఇప్పుడు వాటిని ప్రభుత్వం బాగు చేయలేదని విమర్శించడం హాస్యాస్పదం" అని మండిపడ్డారు.
కన్నెపల్లిలోకి వెళ్లి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, వాస్తవాలను దాచిపెట్టి అబద్ధాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారి ప్రయత్నాలు ఇక ఫలించవన్నారు. తెలంగాణ ప్రజల రక్తాన్ని, చెమటను దోచుకుని వేల కోట్ల అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌కు పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి స్పష్టం చేశారు.
ముఖ్యమంత్రి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు సంక్షేమం, మహిళల సాధికారత, ఉపాధి కల్పన వంటి సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, కమీషన్ల కోసం కాదు.. ప్రజల కోసం పాలన సాగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.




# మానవ హక్కుల పరిరక్షణలో సామాజిక సంస్థల పాత్ర కీలకం

- **ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా** : కాప్రా ప్రెస్ క్లబ్ వేదికగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ బ్యూరో (ఇండియా) నూతన సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహ గౌడ్ లు తాము ఇప్పటివరకు చేపట్టిన కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సేవా భావంతో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే సంస్థలు సమాజ చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె.వి. గీతా సింధు, చిందం మల్లేష్, గడ్డం సాయి కిరణ్, సురేష్ అడ్లూరి, ఎస్. యువరాజ్, డి.రమ్యశ్రీ,, పి వి వి ఎస్ ఎన్ ధనలక్ష్మి, టి విజయలక్ష్మిలకు గుర్తింపు కార్డులు, నియామక పత్రాలను అందజేశారు. సభ్యులు నిబద్ధతతో సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోమ శేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు

# పారదర్శకంగా నిర్వహించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **వివరాల నమోదుకు బి ఎల్ ఓ లకు శిక్షణ కార్యక్రమం**



**మహా వరంగల్ బ్యూరో ;** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు.ఆదివారం మూడు నియోజకవర్గాల బి ఎల్ ఓ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ లో వర్ధన్నపేట నియోజకవర్గం, వరంగల్ ఐ ఎం ఇ హాలులో వరంగల్ తూర్పు నియోజక వర్గం, నర్సంపేట బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ అవగాహన కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని అధికారులకు,బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ ఎన్యుమరేషన్ ఫారమ్స్ ఇంటింటికి పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా మిగిలి ఉన్న ఫారాలను త్వరగా పంపిణీ చేయాలని,పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఓటర్ కు రెండు ఫారంలు అందిస్తారని, అందించిన ఫారంలలో ఓటరు వివరాల నమోదుకు చేసే క్రమంలో కాలనీలోనీ విద్యావంతులు, యువతి యువకులు,రిటైర్డ్ ఉద్యోగస్తులు మరియు వివిధ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ లు ఎన్యుమరేషన్ ఫారమ్స్ నింపడంలో సహకరించినట్లయితే ఓటర్ జాబితా ఆన్లైన్ చేయడం సులభతరంగా పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఓటరు వివరాలు పూరించిన రెండు ఫారాలలో ఒక ఫారం ను బి ఎల్ ఓ లకు అందించినట్లయితే అట్టి వివరాలను యాప్ లో ఎంటర్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే నిర్వహించే సమయంలో ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు.

**నిబంధనల ప్రకారమే మార్పులు చేర్పులు**

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించి, అవసరమైన ధ్రువీకరణ అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పని చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యా రాణి, వరంగల్ ఆర్డీవో సుమ , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, వివిధ మండలాల తహసీల్దార్లు ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తాం

- **ఉద్దేశపూర్వకంగా విపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయి**
- **రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



మంచిర్యాల, మహా :రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం భీమారం మండలంలో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని, 143 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు. అర్హులైన పెంకుటిల్లు ఉన్నవారికి, సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, రేషన్ కార్డులు జారీ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 36 కోట్ల రూపాయలతో 56 కిలోమీటర్ల మేర రహదారులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 63 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు నిర్మించడం జరుగుతుందని, భీమారం మండల పరిధిలో 6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ఆందోళనలు కలిగిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో రహదారి విస్తరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, 1 కోటి 60 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని, 1 కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 20 షాపులలో పేద వ్యాపారస్తులకు ప్రాధాన్యత ఇచ్చి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తదితర అధికారులు, కాంగ్రెస్ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.



## సంకలనం ముద్రణకు రవీందర్ కవిత ఎంపిక

**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, కవి మట్టె రవీందర్ రాసిన కవిత సంకలనం ముద్రణకు ఎంపికైంది. తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో 'ప్రజానేత రావాలి' అనే శీర్షికతో రవీందర్ కవిత పంపారు. మొత్తం 220 మంది ప్రముఖ కవులు పోటీల్లో పాల్గొన్నారు. వీటిలో కొన్ని కవితలు విజేతలుగా నిలవగా 109 మంది కవులు రాసిన కవితలు సంకలనం ముద్రణకు ఎంపికయ్యాయి. ఇందులో రవీందర్ కవిత సైతం ముద్రణకు ఎంపిక కావడం పట్ల జిల్లా జర్నలిస్టులతో పాటు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రవీందర్ ను ప్రత్యేకంగా అభినందించారు.



## సర్ కు ఇబ్బంది కలగకుండా హెల్ప్ డెస్క్

- **మాజీ వార్డు సభ్యులు సలీం ఖాన్**

**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్ నగర్ లో సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తన సొంత ఆలోచనతో హిమాయత్ నగర్ మాజీ వార్డు సభ్యులు సలీంఖాన్ హెల్ప్ డెస్క్ పెట్టి ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సర్ ఫారంలు నింపడంతో పాటు అవగాహన కల్పిస్తున్నారు. హిమాయత్ నగర్ మున్సిపాలిటీలో ఓటర్లకు సర్ ఫారం నింపడంలో ఇలాంటి సందేహాలు ఉన్న తమ వద్దకు రావాలని సలీం ఖాన్ సూచించారు. బిఎల్వోలు ఇచ్చిన ఫారంలో ఎలాంటి చిన్న పొరపాటు జరిగిన ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సర్ ఫారం నింపాలని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు మనకు ఆయుధం లాంటిది అలాంటి ఆయుధాన్ని మనం కోల్పోకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉన్నది. ఎవరు ఆందోళన చెందకుండా సర్ ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. మొయినాబాద్ మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని అనుభవజ్ఞులు తమ పరిసరాల్లోని ఓటర్లకు చైతన్య పరిచి సర్ ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా నింపే విధంగా సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యువజన అధ్యక్షుడు కరీం, ఉపాధ్యక్షులు రహ్మత్, ఇబ్రహీం, ఇమ్రాన్, సల్మాన్,ముద్దసిర్, తదితరులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య



**కుషాయిగూడ , మహా :** కడుపునొప్పి భరించలేక యాసిడ్ సేవించి ఓ వివాహితఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటుచేసుకుంది. జవహర్ నగర్ బాలాజీనగర్ లో పోతరవేణి అనూష, భర్త ప్రవీణ్, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు.ప్రవీణ్ సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత కొంత కాలంగాఅనూష కడుపునొప్పితో బాధపడుతూ అవస్థలు ఎదుర్కొంటుంది. ఈ నెల 4నకడుపునొప్పి మరింత తీవ్రతరం కావడంతో ఇంట్లోనే యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త ప్రవీణ్ అనూషను దగ్గరలోని ప్రైవేటు దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మరో దవాఖానాకు తరలించగాచికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది ఈ మేరకు అనూష తల్లిదండ్రులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.



## మృతుని కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం, అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని భీక్యతండాకు చెందిన బాదావత్ రాములు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సర్పంచ్ దండు ప్రవీణ్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సర్పంచ్ ఏర్పాటు చేసిన సంత్వన నిధి నుండి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామపంచాయతీలో ఏ కుటుంబంలో ఆపదలో ఉన్నా, సర్పంచ్ దండు ప్రవీణ్ ఏర్పాటు చేసిన ప్రయాణం సంత్వన నిధి నుండి ఆదుకుంటూ అందరి మన్నలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




## జర్నలిస్ట్ వీరన్నను పరామర్శించిన బెల్ మేనేజర్

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని భీక్యతండ గ్రామానికి చెందిన, సీనియర్ జర్నలిస్ట్ అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న హైదరాబాద్ మేనేజర్ గుగులోత్ రవి ఆదివారం మృతురాలి నివాసానికి వెళ్లి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. జర్నలిస్ట్ వీరన్నకు సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బెల్ మేనేజర్ రవి వెంట సీనియర్ జర్నలిస్ట్ బానోత్ బాలు ,రాంకీ తదితరులు ఉన్నారు.

## నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం

**వరంగల్ మహా** : వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు.
జిల్లా స్థాయి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణికి, జిల్లా స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి లో నిర్వహించే ప్రజావాణి లో డివిజన్ స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ల సూచించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా తెలిపారు.



## రైల్వే బోర్డు చైర్మన్ ను కలసిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ మహా;**హనుమకొండ జిల్లా కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లను పరిశీలించేందుకు నగరానికి విచ్చేసిన రైల్వే బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్ ను ఆదివారం కాజీపేట రైల్వే స్టేషన్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరపున ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట ప్రాంతంలో కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల ప్రగతి, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆర్డీఓ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 06-07-2026



## అనుకోని సుట్టం

అది దొంగదైతేనేం దొరదైతేనేం
డీప్ ఫ్రిజ్ లో వున్న
నీళ్లబాటల్ లాగా భూమిని మార్చింది
మేనమామ వచ్చినంత సంబరాన్ని
చల్లింది.
అంగాంగం అగ్గి మంటకు
నిప్పను ఐసుపలక మీద పెట్టినట్లున్నది
భూమిభూమంతాఎండతాపంనుంచి
చల్లని గుడారం కింద దూరినట్లున్నది

అది చెప్ప కుండా వస్తేనేం
చెప్పి చప్పట్లు కొడుతూ వస్తేనేం
నెర్రెల అర్రల్లో పొదిగిన గుడ్లు
ఆరుద్రలై నేలతల్లి వీపుపై
కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నయి
ప్రసవానికి సిద్ధంగా వున్న
విత్తనం పొట్టలోంచి
రెండు చేతులతో మొలక శిశువు
కొత్తపొద్దుకు నమస్కరిస్తున్నది
వత్తులేసుకున్న రైతుకండ్లు
కొత్త కలలు కంటున్నయి
రాత్రంతా నిండిన చెరువుల్ని చూసి
పండిన కలలముగ్గులేసిండ్లు రైతమ్మలు
సాలుసాలుకు సరితెల ధారలెంటా
ఇత్నాలతో పాటు
పాటలు నాటుతున్నరు జానపదులు

అది దాడికి దిగితే నేం
చేత్తిర్ల వీపులని చిల్లులు చేస్తేనేం
పిల్లల నీళ్ళాటకు కాల్వలు కుంటలు
అలలచేతులతోఎదురుచూస్తునయి
ఎండిన పిట్టల డొక్కలు
పదునారిన పసుల నాలుకలు
చూపులెండిన ఉడతల కండ్లు
ఒక్క వానకే కేకలేస్తున్నయి
దరిదాపులేని చిమ్మట్లు కీచురాళ్ళకు
పచ్చదనం తల్లికొంగయింది
ఒక్క వాననేమూడునెళ్లఎండపొగరును
నిలువునా కడిగి పారేసింది.
భూమి నిండా ఆకు పచ్చని కార్పేట్
పరిచి నట్లయింది.

**డా. ఉదారి నారాయణ,**
**9441413666.**

## మల్లవరపు జాన్ శతజయంతి సదస్సు


కేంద్ర సాహిత్య అకాడెమి, జానుడి సాహిత్య కళల అధ్యన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మల్లవరపు జాన్ శతజయంతి సదస్సు జూలై 12 ఆదివారం, ఉదయం 10 గంటలకు ఒంగోలు మల్లయ లింగం భవన్ లో జరుగు తుంది . నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించే ఈ ప్రారంభ సభలో షణ్ముఖా నంద, సి.మృణాళిని , బి జవహర్, మల్లవరపు జాన్ మనుమడు మల్లవరపుప్రభాకరరావు పాల్గొంటా రు. కోయి కోటేశ్వరరావు కీలకోపన్యాసం చేస్తారు. దార్ల వేంకటేశ్వర రావు ,బీరం సుందరరావు ,వైవిజయానందరాజు ,కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి ,కప్పగంతుల మధుసూదన్, విస్తాలి శంకర రావు పత్రసమర్పణ చేస్తారు. పాటిబండ్లఆనందరావు, చల్లపల్లి స్వరూపరాణి సాంకేతిక సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు

**సి మృణాలిని, కన్వీనర్, తెలుగు సలహామండలి ,**
**కేంద్రసాహిత్య అకాడెమి**

# ఉప్పరి వెతల్ని కైగట్టిన 'మెట్న'

ముంబాయి నగరంలోని అసెంబ్లీ హాల్, విటి స్టేషన్, రాజభాయి టవర్స్ లాంటి పురాతన కట్టడాలు మొదలు హిమాచల్ ప్రదేశ్‌లోని భాక్రానంగల్ డ్యామ్ వరకు అన్నీ పాలమూరు బిడ్డల చెమట చుక్కలతో తడిసిన నిర్మాణాలే. వలసబోయిన ఈ కార్మికుల ఆదరువు ఉప్పరి మేస్త్రీలు. హైదరాబాద్‌లో తలెత్తుకొని చూడాల్సిన హైటెక్ భవంతులు మొదలు గ్రామాల్లో రచ్చకట్ట నిర్మాణం వరకు అన్నీ ఉప్పరుల పనితనమే. గ్రామాల నుంచి రాష్ట్ర రాజధానికి, దేశ వాణిజ్య రాజధానికి సాగిన ఉప్పరుల వలసలు వారిని ఆర్థికంగా బలోపేతం చేయలేక పోయాయి. అర్ధాకలి వేదనలే మిగిల్చాయి. ఈ వేదనను, ఇప్పటికీ అక్షరాలకు దూరమయిన ఉప్పర సామాజిక వర్గం అనుభవిస్తున్నది. బీసీ కుల దొంతరలో కింది నుంచి వీరి స్థానాన్ని లెక్కగట్టాల్సి వస్తున్నది. ఆకాశాన్ని తాకే పలు అంతస్థుల భవనాలను వందల యేండ్ల కిందనే నిర్మించిన సివిల్ ఇంజనీర్లు వీళ్ళు. ఎంతటి కన్‌స్ట్రక్షన్ అయినా ఈంచ్ కూడా తేడా రాకుండా నిర్మించి అందించిన నిర్మాతలు. ఈ నిర్మాతల వెతలను, వారి జీవన విధానాన్ని, కట్టడాల నిర్మాణ నైపుణ్యాన్ని, అందుకు అవసరమైన పనిముట్లను, తమ కులదైవం భగీరథుడు మొదలు వాస్తుశాస్త్ర నిపుణుడైన తన నాయిన వరకు అన్నింటినీ యువ కవిమిత్రులు ఉప్పరి తిరుమలేశ్ ఈ 'మెట్న' దీర్ఘకవితా సంపుటిలో పొందుపరిచిండు. ఉప్పరి బతుకు బరువుని కైగట్టిండు. పురాణాల్లోని సగరరాజు మొదలు ఆధునికంలో నగరాల్లో దుర్భర జీవితం గడుపుతున్న ఉప్పరులను ఇందులో చిత్రించిండు. ఎత్తుపల్లాలు లేని సమాజాన్ని కాంక్షిస్తూ 'మెట్న'ను మట్టిమనుషుల 'మూలమట్టాల'ను సవరిస్తూ మనకందించిండు. 'మెట్న' అనే పేరు పెట్టడంలోనే ఉప్పరి అస్తిత్వ ప్రకటన ఉన్నది.

ఉద్యమానికి సాహిత్యం ఊపిరులూదుతుంది. ఇప్పుడు బీసీ వాద ఉద్యమాలని ఈ 'మెట్న' కూడా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది. తెలుగులో చాలా మంది వృత్తి జీవితాలను దీర్ఘ కవితలుగా వెలువరించిండ్రు. పి.వి.రామనర్సయ్య, ఎన్.గోపి, రాధేయ, ప్రసాదమూర్తి, పున్న అంజయ్య, సజ్జా వెంకటేశ్వర్లు, పులిపాటి గురుస్వామి, పత్తిపాక మోహన్, వెల్దండి శ్రీధర్, మోహనకృష్ణ, ఆడెపు లక్ష్మణ్, భీంపల్లి శ్రీకాంత్, కోడం పవన్‌కుమార్, రాపోలు జగన్, రాపోలు సత్తయ్య, గోశిక నరహరి తదితరులు 'పద్మశాలి' జీవితాలపై, గౌడ జీవితాలపై మామిండ్ల రామాగౌడ్ (1970), చెరుకు ఉషాగౌడ్, కొంపెల్లి వెంకట్ గౌడ్, ఈ. రాఘవేందర్, శీలం భద్రయ్య, తండ హరీష్ గౌడ్, అంబటి నారాయణ తదితరులు కవిత్వమల్లిండ్రు. కుమ్మరుల జీవితాన్ని అన్నవరం దేవేందర్ 'బువ్వకుండ', 'రుంజ' విశ్వకర్మ కవుల కవిత్వం, బాణాల శ్రీనివాసరావు 'కొలిమి', గన్నోజు 'కుంపటి* విశ్వబ్రాహ్మణుల, దాసోజు కృష్ణమాచారి 'డాకలి', 'పుటం', 'వన్నె' స్వర్ణకారుల బతుకు వెతలను, యం.వెంకట్ 'ఎన', 'మెద', 'జెన' కవితా సంపుటాలు బెస్తవారి జీవితాలను చిత్రించింది. విశ్వబ్రాహ్మణులపై అవుసుల భాను ప్రకాశ్, మంగలి జీవితాలను వనపట్ల సుబ్బయ్య 'అసిపె', భూసురపల్లి వెంకటేశ్వర్లు 'నాన్నకోసం' పేరిట భజంత్రీల బతుకు వెతలపై ద్వీకావ్యాల్ని వెలువరించిండు. 'వడ్డెర' జీవితాలపై వడ్డెముద్దంగుల ఎల్లన్న, అందె వెంకటరాజం, సగరులపై దొరవేటి తదితరులు కవిత్వం వెలువరించారు. అంతేకాదు జూలూరు గౌరీశంకర్, చింతం ప్రవీణ్, జయప్రకాశ్‌లు, బడేసాబ్‌లు బీసీ వాద కవిత్వ




సంకలనాలు వెలువరించారు. వీటికి కొనసాగింపుగా ఇప్పుడు ఉప్పరి వృత్తిపై తిరుమలేశ్ 'మెట్న' జోడిస్తున్నడు. ఉప్పరుల ఆర్తి, ఆవేదన, అభిమానం, ఆకలి, అమరత్వం, ఆత్మగౌరవం, ఆయంకాయం, వృత్తి ఆదరువు, ఆదరణ అన్నింటినీ స్వీయానుభవంతో అక్షరాల ఇటుకలుగా పేర్చి కవితా భవనాన్ని నిర్మించిండు. ఆనకట్టలు నిర్మించిన సగరులకి ఎకరం భూమి పట్టాలేదంటూ, బడిని నిర్మించిన ఉప్పరుల బతుకులు దాని బయటే తెల్లారుతున్న తీరుని చెప్పిండు. పార్లమెంటుని, అసెంబ్లీని పసందుగా నిర్మించిన తమ జాతి సోదరులు ఎన్నడూ దాని లోపల కూర్చొని చర్చ చేయలేదని చెప్పిండు. అంటే రాజ్యాధికారంలో తమ వాటా హక్కుగా దక్కాలని నినదించిండు. గోడ కట్టేటప్పుడో, గోవా కట్టెల మీది నుంచో ప్రమాదవశాత్తు భవన నిర్మాణ పనుల్లో అసువులు బాసిన వారి రోదనను వినిపించిండు. విలపించిండు. ఈ ప్రపంచంలో ఇసుక, మట్టి, సిమెంట్‌తో ఏ నిర్మాణం జరిగినా దాని వెనుక ఉన్న ఉప్పరుల శ్రమశక్తిని, శ్రమకు తగ్గ ఫలితం దక్కని దీనమైన బతుకులను కండ్లల్లో నీళ్ళు చిప్పిల్లే విధంగా చెప్పిండు. ఆనకట్టలు, రచ్చకట్టలు, స్మారక స్థూపాలు, ప్రార్థనా స్థలాలు, భవనాలు, జాతీయ రహదారులు ఇట్లా మట్టి పని ఏదైనా ఉప్పరుల చెమట చిందకుండా రూపం దాల్చదని ఈ సంపుటిలో తేల్చి చెప్పిండు. అదే సమయంలో వారి నిర్మాణ కళా కౌశలాన్ని కైగట్టిండు.

నిత్యం తలెలో అన్నమై మెరిసే మెట్న, గుండు దారం, తాపీ లాంటి ఇంటి నిర్మాణ అస్త్రాలను గుండెలకద్దుకున్నడు. 'గడ్డపార' తమ కలం అని శ్రమ సౌందర్యాన్ని ఘనంగా పొగిడిండు. ఎత్తుపల్లాలను చదును చేసే రోడచెక్కను సగరుల ఆయుధంగా, మట్టిగోడల తీర్చి దిద్దే కర్నెను ఘనంగా కీర్తించిండు. సుత్తెను తమ జాతి అస్తిత్వ పతాకంగా ఎగరేసిండు. అష్టదిక్కుల రహస్యాలను విప్పి జెప్పడమే గాకుండా వాస్తు శాస్త్ర నిపుణత కూడా ఉప్పరులకు అబ్బిన విద్య అని చెప్పిండు. ఇల్లు నిర్మాణమయిందంటే అందులో నివాసముండే వారు 'ఆయం ఖాయం'గా ఉండాలని ఆశిస్తూ అక్షరాలద్దిండు. పేదవాడి సొంతింటి కలను నెరవేరుస్తున్న శ్రమజీవులు ఉప్పరులు అని కైగట్టిండు. మట్టిగుణం తెలిసిన మట్టి మనుషులం తామే అని గర్వంగా చెప్పుకున్నడు. అంతెందుకు ఊరికి ముగ్గు పోసేది ఉప్పరులే అని 'మెట్న'లో అక్షరబద్ధం చేసిండు. ఆధునిక కాలంలోని ఉప్పరి జీవితాలనే కాదు సనాతన కాలంలో సగరుల పురాణాన్ని విప్పి చెప్పిండు. శ్రమజీవుల సామాజిక చరిత్రను శిలాక్షరాలుగా చిత్రించాడు.

**"మత్తడి కట్టిన మట్టి మనుషులం**
**చెరువు కింద ఎకర భూమిలేని**
**నిరుపేదలం ఉప్పరులం"** అంటూ

శాశ్వత శ్రామికులుగా మారిన జీవితాలను చిత్రించాడు.

**"చెమట చుక్కల ప్రతిరూపాలు**
**అమరుల స్ఫూర్తి స్తూపాలు**
**ఉద్యమవీరుల జ్ఞాపకాలు**
**చరిత్రకు నిలువుటద్దంగా**
**నిర్మించిన ఉప్పరులం మేము**
ఊరికి ముగ్గుపోసే రథసారథులు"

కమ్యూనిస్టులు, సుత్తి కొడవలిని గుర్తులుగా పెట్టుకున్నవాళ్లు సైతం మేలు చేకూర్చలేదని శ్లేషగా చెప్పిండు. చదువే బహుజనులకు మేలు చేకూరుస్తుందని పూలే ఆలోచనలను ఇట్లా చెప్పిండు.

**"బడికి**
**ముగ్గుపోసి**
**పునాది తీసినందుకేనేమో**
**మేమువిద్యాబుద్ధులకు**
**దూరం అయ్యాము"**

ఎప్పుడైనా, ఎక్కడైనా ఉద్యమం`సాహిత్యం రెండూ జమిలిగా పరస్పర పూరక ప్రేరకాలుగా పనిచేసిన్నప్పుడు మాత్రమే అనగారిన వర్గాలు హక్కులు సాధించుకోగలరు. ఇప్పుడు బహుజనోద్యమాల కాలం నడుస్తున్నది. విద్యా, ఉద్యోగాలతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పిస్తూ తెలంగాణ చట్టసభల్లో తీర్మానాలు జరిగాయి. ఈ తీర్మానాలు ఆమోద ముద్ర పొందాలి అంటే 50శాతం రిజర్వేషన్లు దాట కూడదనే నిబంధన అడ్డొస్తున్నది. ఈ అడ్డంకి తొలగాలంటే ఉద్యమం తప్ప మార్గం లేదు. ఎవరి వాటా వారు హక్కుగా దక్కించుకోవాలంటే ప్రతి ఒక్కరు కలిసి రావాలి. ఐక్యంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలి.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేసింది. ఈ సర్వేలో ఏ కులం వారు ఎట్లాంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, స్థితిలో ఉన్నారు. వారి విద్యాభివృద్ధి ఎలా ఉన్నది అనేది కూడా ఇందులో తేటతెల్లమయ్యింది. వీటి ఆధారంగా వెనుకబడిన వర్గాల వారి పురోభివృద్ధికి తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలేవి అనే చర్చలు జరుగుతున్నాయి. అయితే దురదృష్టవశాత్తు ఈ వివరాలేవీ పబ్లిక్ డొమైన్‌లో లేకపోవడంతో ఎవరి స్థితిగతులేమిటో అంతు చిక్కడం లేదు. బీసీలను కేవలం ఓట్లేసే యంత్రాలుగా చూస్తూ ఉండడంతో ఈ దురవస్థ ఏర్పడింది. కొంచె ఎక్కువ తక్కువ దాదాపు బీసీలందరిది ఇదే స్థితి.

నిజానికి సాహిత్యం`రాజకీయం రెండు వేర్వేరు అంశాలు కావు. రాజకీయ నాయకుల చేత ప్రభావితులయ్యే ప్రజలను చైతన్య పరిచేది, సరైన దారిలో నడిపించేది సాహిత్యమే. సాహిత్యంలోకి వచ్చిన విషయాలే ఎక్కువగా చర్చనీయమవుతాయి. సాహిత్యం సమాజంలోని ఇన్‌ఫ్లూయెన్సర్స్‌ని ఆలోచించేలా చేస్తుంది. ఈ ఆలోచన ఇంటలెక్చువల్ వర్గాలకు చేరుతుంది. ఇట్లా ఉప్పరి సామాజిక వర్గం నుంచి ఉన్నతమైన ఆదర్శాలతో, అంతే ఉన్నతమైన ఆలోచనలను అక్షరాలుగా అల్లిండు కవి ఉప్పరి తిరుమలేశ్. ఇంతకుముందు నాగలి లాంటి కొన్ని రచనలు చేసినప్పటికీ ఈ రచన తిరుమలేశ్‌కి బీసీవాద సాహిత్యంలో సుస్థిర స్థానం కల్పిస్తుంది.



**డా. సంగిశెట్టి శ్రీనివాస్**

## ఆకాశం కింద...

ఈ దారులన్నీ
కాలేజీ వైపే పోతాయనుకుంటారు...
కాదు.
కొన్ని దారులు
తల్లిదండ్రుల గుండెల్లోంచి
నేరుగా
పిల్లల భవిష్యత్తులోకి పోతాయి.
నెత్తిమీద
పెట్టెలు కనిపిస్తాయి
ఎవరూ చూడరు గానీ,
వాటి కింద
ఏళ్ల తరబడి మోసిన అప్పులు ఉంటాయి
అణచుకున్న ఆశలు ఉంటాయి
వాయిదా పడిన జీవితాలు ఉంటాయి.
ఆకాశమంతా
నెత్తిన పెట్టుకుని
నడుస్తున్నాడు తండ్రి.
తలపై ఉన్నది పెట్టె కాదు
బాధల బరువు.
బాధ్యతల భారం.
ఇంట్లో అమ్మ దాచిన ఆకలి.
ఈ దేశంలో
ప్రతి డిగ్రీ సర్టిఫికెట్ వెనుక
ఒక మధ్యతరగతి తండ్రి
చిరిగిపోయిన చొక్కా ఉంటుంది
చెమటతో చెల్లించిన చరిత్ర ఉంటుంది.
ఒక తల్లి
దాచుకున్న ఆకలి ఉంటుంది
దిగమింగుకున్న దుఃఖం ఉంటుంది.
ఒక కుటుంబం
వాయిదా వేసుకున్న వర్తమానం ఉంటుంది
పణంగా పెట్టిన భవిష్యత్తు ఉంటుంది.

**~ బసడ సంపత్ యాదవ్**
**7032132593**

# మనసున్న పల్లెనె ,వన మంచు పల్లె

అది త్యాగాలపల్లె, అమరత్వంతో పురుడు పోసుకున్న, వనమంచు పల్లె మద్దిలేటి పాటలు అతడు ఎర్రజెండా కింద ఓనమాలు దిద్దుకుండు. ఆకలి ,అంటరానితనం, పేదరికం నుండి వచ్చినోడు. నల్లమల్లకు కూతపెట్టు దూరంలో, మద్దిలేటి పుట్టిన ఊరు కల్వకోలు. ఎంతోమంది వీరులను కన్న ఊరు. అలాంటి ఊర్లో వనమంచు పల్లె పురుడు పోసుకుంది.

చిన్నప్పటినుండి ఆకలి అవమానాలను మూట కట్టుకొని తిరిగినాడు. చిన్నతనంలోనే, ఉద్యమాల బాటలో నడిచినోడు. అందుకే ప్రజలపై జరుగుతున్న దాడులు, ప్రభుత్వ ధమన నీతిని, కేంద్ర ప్రభుత్వాల ద్వంద వైఖరి లపై, వనమంచుపల్లె తిరగబడిండు. ఒకపక్క ప్రభుత్వ టీచర్గా పని చేస్తూ, మరొక పక్క ప్రజా చైతన్య గీతాలను రాస్తున్నాడు. తన అస్తిత్వాన్ని కాపాడుతూ, కలం పేరుకు ఊరి పేరు పెట్టుకొని, కన్న ఊరును ప్రపంచానికి పరిచయం చేసిండు మద్దిలేటి.

అందులో భాగంగానే మన ముందుకు ,వనమంచు పల్లె పాటల పుస్తకాన్ని, తీసుకొచ్చిండు. ఆపుస్తకంతో, ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజ్యంపై యుద్ధం ప్రకటించిండు. కుళ్లిపోయిన రాజ్యంలో కూలి తల్లుల ఆకలి శోకాలను చూసి, కలత చెంది. పేదలను ఏకం చేసి పోరు చేయమన్నాడు. పోరు బాటలో, ఒరిగిన వీరులను తలుచుకుని రాగం అందుకున్నాడు

అదేవిధంగా మావోయిస్టుల పేరు మీద ఆదివాసి గిరిజనులను చంపి అడవిని రక్తసిక్తం చేసి. అక్కడి సంపదను దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్న, రాజ్య సామ్రాజవాద దోపిడి పై యుద్ధం ప్రకటించండు.


నడువు నడువు నాగులన్న
నల్ల మల్లకు నడువు నాగులన్న
నడిసి నడిసి నాగులన్న
నల్లమల్లను రక్షించమని పిలుపునిచ్చిండు.

ప్రజల కోసం ప్రాణమిచ్చిన వీరులను ,తలుచుకొని వలపోస్తుండు. నేస్తమా నిన్నెట్లా నేను మరవరా అయ్యో ప్రాణమా నిన్ను ఎట్ల నేను వదలరా!
ఏ తల్లి కనిపెంచిందో
ఏ పల్లె నిన్ను సాధిందో
విప్లవాల తోవమనల
విడదీయని మిత్రుల చేసిందో
రాజ్యం పెట్టిన ఆజ్యంలోన
రాలి నింగి కెగిసితివేమో
నమ్మకద్రోహుల వలలో
చిక్కి నేల రాలేవేమో అని దుఃఖపడుతాడు. నీవు లేకున్నా మీ ఆశయాలను కొనసాగిస్తాం. సమతా రాజ్యం వచ్చేదాకా ఈ రచనలు ఆపనని ప్రతినబూనిండు.

మద్దిలేటి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుసున్నాడు.
ఎన్నో ఎన్నెన్నో ఆనందాలు
ఆ చిన్ననాటి చిలిపితనం
చింతలేని వింతతనం
ఎండాకాలం ఈత కొట్టిన బావిని, ఒడ్డులెంటా తిరగాడిన నేలను, గోటి లాటను, గోనె బిల్లాటను, బొంగు రాలాటను, కోతి కొమ్మాటను, కోలాటం ఆటను, ముక్కు గిల్లే ఆటను జ్ఞాపకం చేసుకొని, 50 ఏళ్లు వెనక్కి పోయి చిన్నపిల్లాడిలా గంతులెస్తుండు.

ఆడపిల్లల జీవితం గురించి, చాలా గొప్పగా రాసిండు.
అందమైన చందమామ నా ఆడపిల్ల
అంతులేని బాధలోయమ్మ నా ఆడపిల్లకు
అంతులేని ఆవేదనను, దుఃఖాన్ని కండ్లకు కట్టినట్లు చూపించాడు.

అదేవిధంగా వాళ్లకు ధైర్యాన్ని నూరిపోసిండు ఒక సావిత్రిబాయిలా, ఒక రుద్రమదేవిలా , ఒక సమ్మక్క, సారక్కలా, వీరనారుల దారిలో పోయి జగతికి వెలుగు కావాలని సూచించిండు.




మద్దిలేటి, వనమంచు పల్లెకు ,పోయి అక్కడి అందాలను చూడడానికి రమ్మంటున్నాడు. వెన్నెలమ్మ వెలుగులో, బొడ్డెమ్మ పాటలు, కోలాటం పాటలు, బతుకమ్మ పాటలు, కష్టజీవుల వ్యథలు, కదనాల కథలు, యుద్ధాల చరిత్రలను, తెలుసుకోవడానికి రమ్మని పిలుస్తున్నాడు. మద్దిలేటి పేదల జీవితాలను ఏమని పాడాలి, రాస్తే రామాయణమంతా, చెప్పితే మహాభారతమంతా, పేదలకష్టాల గురించి ఏమని పాడుదని వ్యంగంగా పాడుతాడు.

అంబేద్కరిజం ఆపడానికి ఎవరి తరం కాదు అని మద్దిలేటి ఘంటాపదంగా చెపుతాడు. అంబేద్కరిజం పొద్దు లాంటిది. పొద్దును ఆపడానికి ఎవరితరమైతది. ఆ విధంగానే అంబేద్కరిజం ఆపడానికి ఎవరి తరం కాదని, ఇది భూమి ఉన్నన్నాళ్ళు ఉంటదని చెప్పాడు.

పుస్తకం గురించి.
ఇది ఒక జ్ఞానపూల తేరు
ఇది ఒక విజ్ఞాన పూలపోరు అంటాడు.
ఎన్ని జన్మలెత్తినా అమ్మ జన్మ గొప్పదంటాడు.
అపరూపమైనది. అమ్మ జన్మే అని చెపుతాడు
పొత్తిళ్ల పసిగుడ్డు నుండి, అమ్మ చనిపోయే వరకు మన బాగోలు చూస్తది. అమ్మ ప్రేమ చాలా గొప్పది
అమ్మ లేకపోతే జగదేలేదు.

మద్దిలేటి తన పుట్టిన తాలూకా కొల్లాపురం గురించి చాలా గొప్పగా కీర్తించండు. అడివి అమ్మ వడిలోని అందాలపురం. దాని చుట్టూ నల్లమల్ల అందచందాలు. నెత్తిన కృష్ణమ్మ పరుగులు గంగా వోలే, రాజులేలిన చారిత్రక కోటలు, కవులను ,వీరులను, యోధులను ,కన్న గొప్ప పురం కొల్లాపూర్ అని కొనియాడిండు.

ఫుట్పాత్ బతుకుల గురించి. వాళ్ల కన్నీళ్లను, ఆకలిని వెతలను ,కథలను ,వారి జీవన విధానాన్ని, పూసగుచ్చినట్లు చెప్పిండు. పూలు అమ్మేవాళ్ళు, బజ్జీలు అమ్మేవాళ్ళు, పండ్ల బండి వాళ్ళు ,పాను డబ్బా వాళ్లు అరే కుమాలు అమ్మే వాళ్ళు, స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచిన పేదల బతుకులు ,మారలేదని వాపోతాడు.

పుస్తకం గురించి.
ఇది ఒక జ్ఞాన పుష్పమని
ఇది ప్రపంచానికి, జ్ఞాన నేత్రంఅని చెప్తాడు.
మనిషిని, మనిషిగా నిలబెట్టేదే పుస్తకం
మనిషికి విలువలు నేర్పేదే పుస్తకం
మనిషి భూమి నుండి ఆకాశం ,ఎత్తు ఎదగడానికి పుస్తకమే మార్గం అని చెప్తాడు.

మంగలి వాళ్ల జీవితాల మీద అద్భుతంగా రాసిండు మద్దిలేటి. ఆటొ అద్దం, ఇటొ అద్దం
అద్దాలతోనే డబ్బా, ఆ డబ్బాలలో సుద్దులతో మా మంగలన్నా, పొద్దంతా పనిచేస్తివో మా మంగళన్న
మొదటి చస్త్రచికిత్సకు మూలమని, ఈనంగా వచ్చినోన్ని, హీరోగా చేస్తావని మంగలి జీవితం గురించి చెప్పిండు.

బుద్ధుడు వెలసిన ఈ నేలమీద రక్తం పారొద్దు అంటాడు మద్దిలేటి, బౌద్ధం ఈ దేశానికి రక్షణ కవచం అంటారు .
హింసను , విడనాడి. అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించి. బౌద్ధాన్ని ప్రపంచానికి పరిచయం చేసిండు. గాంధీ అహింసా మార్గం ద్వారానే స్వాతంత్రాన్ని సాధించాడు. రాజ్యహింసలు లేని రాజ్యం రావాలి అది బౌద్ధంతోనే సాధ్యమని చెప్పాడు

వనమంచు పల్లె పాటల పుస్తకంలో, నాన్న గురించి కరువు గురించి, కరోనా గురించి, వీరుల త్యాగాల గురించి ,ఉద్యోగుల దయనీయ పరిస్థితి గురించి, కాంట్రాక్టు ఉద్యోగుల బతుకుల గురించి ,పల్లె గురించి, అడవి గురించి ,వలస గురించి, కమ్యూనిస్టు ఉద్యమాల గురించి ,చాలా గొప్పగా రాసిండు. మద్దిలేటి అతనికి సామాజిక స్పృహ చాలా మెండు. వాళ్ల కుల వారసత్వం నుండి వచ్చిన భక్తి పాటలు నుండి, అదే విధంగా మా ప్రాంత భారతదేశం గర్వించదగ్గ బిడ్డ ,ప్రజాకవి, వాగ్గేయకారుడు గోరెటి వెంకన్న ప్రభావం మద్దిలేటి మీద నిండుగా ఉంది. అందుకనే పల్లె జీవన నాడిని పట్టుకున్నాడు. ఇంకా ప్రజల వైపున నిలబడి. మరెన్నో రచనలు చేయాలని, మనస్ఫూర్తిగా కోరుతూ..

**ఎదిరెపల్లి కాశన్న**
**9640006304**

# ఆ పాత మధురాలు...

ఎం. ఎస్. సుబ్బులక్ష్మి అన్నమయ్య కీర్తనలు, మంగళంపల్లి బాల మురళి కృష్ణ రామదాసు కృతులు, డి. కె. పట్టమ్మాల్, ఎం. ఎల్. వసంతకుమారి కర్ణాటక సంగీతం... ఘంటసాల, బాలు మధుర గీతాలు, సుశీల, ఎస్. జానకీ పాటలు. ఇవి ఓ మధురానుభూతికి మచ్చుతునకలు... ఆ సంగీతం, సాహిత్యం, రాగం, భావం వాటిని ఆకళింపు చేసుకొని పాడిన విధానం, ఆ గొంతుకలు మరపురాని ఓ అనుభవం మూట గట్టుకునేలా చేస్తాయి. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటే ఇదేనేమో? నాటి వాగ్గేయకారులు, సాహితీ వేత్తలు, గాయకులు, గేయ రచయితలు ప్రజల హృదయాల్లో చిరస్థాయి స్థానం సంపాదించుకున్నారు.అలనాటి కళాకారుల ప్రతిభ వెల కట్టలేనిదే. ఒక్కసారి గత వైభవం తల్చుకుంటే ఒళ్ళు జలదరించక మానదు. శ్రీ వెంకటేశ్వరుని పాదసేవలో తరించి 32 వేల కీర్తనలు రచించిన అన్నమయ్య నిజంగా ఆ శ్రీవారి వర ప్రసాది అనటంలో సందేహం లేదు. భక్తుడు భగవంతుడి సేవలో ఎలా తరించాలో చాటి చెప్పిన మహానుభావుడు. అదిగో అల్లదిగో శ్రీహరి వాసమూ అంటూ ఏడుకొండల గొప్పతనం చెప్పుకొచ్చిన అన్నమయ్య కుల, వర్గ, వర్ణ వ్యవస్థను ఎండగడుతూ బ్రహ్మ మొక్కటే పర బ్రహ్మ మొక్కటే అంటూ చెప్పుకుని వచ్చారు. ఇక రామదాసు కీర్తనలు అపూర్వం. అజరామం. అదిగో భద్రాది గౌతమీ అదిగో చూడండి... అంటూ భద్రాద్రి గొప్పతనం, గోదావరి విశిష్టత చెప్పుకొచ్చారు. ఆయన కృతులు పండితులు, పామరులు కూడా ఆస్వాధించి ఆనందం పొందుతూంటారు. త్యాగయ్య కృతులు ఇహ, పర మోక్ష మార్గాలు. ఘన రాగాల్లో ఆయన రచించిన పంచరత్న కీర్తనలు అతి మధురం. ముఖ్యంగా శ్రీరాగంలో ఎందరో మహానుభావులు కృతి ఏదో ఓ సందర్భంలో పలువురి నోట జాలు వారుతూనే ఉంటుంది. తరాలు అంతరించి పోయినా వారు భావి తరాలకు ఓ ఉత్తమ మార్గం చూపించి చిరస్మరణీయులయ్యారు. సంప్రదాయ సంగీతం దారిలో కొత్త వరవడితో పుట్టుకొచ్చిన లలిత సంగీతం కూడా జనాదరణ పొందింది. అలనాటి గాయకులు ఈల పాట రఘురామయ్య, మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, ఎం. ఎస్. రామారావు, గంటసాల వెంకటేశ్వర్లు, బాల సుబ్రహ్మణ్యం, బాల సరస్వతి, భానుమతి, పీ. సుశీల, ఎస్. జానకీ, పీ. లీలా ఇలా చెప్పుకుంటూ పోతే లలిత సంగీతాన్ని సినిమా పాటలతో రక్తి కట్టించిన మహా మహులు ఎందరో వున్నారు. పాత పాటలలోని మాధుర్యం, అప్పట్లో సంగీత దర్శకులు వాడిన రాగాలు, పాడిన విధానం, గేయ రచయితలు అందించిన సాహిత్యం అద్భుతం. అందుకే నేటికీ అవి సజీవంగా ఉండి పోయాయి.

రచయితల విషయానికి వస్తే అది ఓ సాగరమంతా ఉంటుంది. విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయి పడగలు మొదలుకుని శ్రీరంగం శ్రీనివాసరావు రచించిన మహా ప్రస్థానం వరకు సాగిన అప్పటి రచనల గురించి చెప్పుకోవటానికి మాటలు చాలవు. ఆచార్య దాశరధి, సీ. నారాయణరెడ్డి, కొసరాజు, ఆత్రేయ, వేటూరి సుందరరాం మూర్తి వంటి రచయితలు ఏ తరానికి ఏ సాహిత్యం మనసుకు హత్తుకుంటుందో గమనించి మరి గేయ రచనలు సాగించటం వారి ప్రతిభకు ఓ తార్కాణం... ఇక సిరి వెన్నెల చిత్రంతో సినీ గేయ రచయితగా ప్రజల గుండెల్లో నిలిచి పోయిన సీతారామశాస్త్రి తన పదునైన కలం నుంచి విదిలించిన పదాలు పాటల రూపం దాల్చి ప్రజలను మెప్పించిన తీరు గొప్ప అనుభూతి. ఇక విప్లవ భావానికి, తాడిత, పిడిత, బడుగు, బలహీన వర్గాల బాధలు జత చేసి పాటల రూపం లో ఉగ్రుతలూగించిన వంగపండు ప్రసాద్ రావు,గద్దర్, గోరంటీ వెంకన్నలాంటి వాళ్ళు ఎందరో ఎందరెందరో వున్నారు.ఇలాంటి మహా మహులకు నెలవు అయిన మన తెలుగు రాష్ట్రాలు ఎంతటి పుణ్యం చేసుకున్నాయో అనిపించడం సహజం. చెప్పుకోవాలి అంటే తెలుగు సాహిత్య సంపద ఓ పెద్ద కావ్యం. నేటి తరానికి నాటి తరం సాహితీ వేత్తలు, కళాకారులు పెద్దగా తెలీదు. వారికి తెలియజేసే పరిస్థితి ఇప్పుడు లేదు.

కాలచక్రం గిర్రున తిరిగి పోతోంది. కాలం గతించి పోయినా గతానుభవాలు మాత్రం సజీవంగా ఉండి పోతాయి. ఇది చరిత్ర చెప్పే నిజం. ఈ ఆధునిక యుగంలో అంతా గందరగోళం.ఓ చెప్పుకోదగిన సాహిత్యం, వినాలి అనిపించే పాట లేదు. అంతా రణగొన ధ్వని... పాట ఏమిటో, సాహిత్యం ఏమిటో, పాడే విధానం ఏమిటో, సంగీతం ఏమిటో అర్ధం చేసుకోవటం కష్టం. కానీ నేటి తరానికి అవే కావాలి. అర్ధం కానీ పాట ఇప్పుడు అద్భుతమైపోతోంది. అప్పటి సాహిత్యం, రాగం, సంగీత కూర్పు, పాడే విధానం అంతా అయోమయమే. ఇది స్పీడ్ యుగం అని, పాటలు ఇలా పాడితేనే రక్తి కడతాయని మెచ్చుకుంటూ వాటిని 24 గంటలు వింటూ ఆనందించే వారికి ఏమి చెప్పలేం. నాటి సంగీతం నేతి గారెలు అయితే ఇప్పటి పాటలు పిజ్జాలు... అది నేటి పరిస్థితి.




**జీ. వెంకటరమణ**

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.



# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణం లోని ప్రజా సేవ భవన్ లో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు.అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యల పై కంది శ్రీనివాస రెడ్డి కి వినతి పత్రాలు అందించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, మునిగెల విఠల్,దాసరి ఆశన్న, ఎంఏ షకీల్, గడ్డం జగదీష్ రెడ్డి,విఠల్, తదితరులు పాల్గొన్నారు.




# విగ్రహ ప్రతిష్టాపనకు హాజరైన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని ధోబీ కాలనీలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ, పోచమ్మ ఆలయాలలో జరిగిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.శాలువాలతో సత్కరించారు. ఆలయం లో కంది శ్రీనివాస రెడ్డి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, వార్డు కౌన్సిలర్ చరణ్ గౌడ్



ఆలయకమిటీ సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ వేడుకల్లో కంది శ్రీనన్న

**ఆదిలాబాద్ మహా:** అభిమానంతో ఆహ్వానించిన వారి శుభకార్యాలకు హాజరవుతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి . ఆదివారం పట్టణంలో జరిగిన పలు వివాహాలు ,ఎంగేజ్ మెంట్ , బారసాల వేడుకలకు శ్రేణులతో కలిసి హాజరయ్యారు. మండపంలో అందరినీ ఆప్యాయంగా పలకరించారు. నూతన దంపతులను , బారసాల జరుపుకున్న చిన్నారిని దీవించి కానుకలు అందించారు.వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ , ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,శాంతన్ రావు, విఠల్ ,ఎంఏ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వర్షానికే హైదరాబాద్ చెరువవుతోంది..!

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై కిషన్ రెడ్డి విమర్శలు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హైదరాబాద్‌లో చిన్నపాటి వర్షానికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి డ్రైనేజీ, రహదారుల నిర్వహణలో వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. నాంపల్లి నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పర్యటించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, మురుగు కాలువల పూడికతీత పనులు సరిగా చేపట్టకపోవడంతో నగరంలోని అనేక ప్రాంతాలు జలమయమవుతున్నాయని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను లండన్, సింగపూర్‌లా తీర్చిదిద్దుతామని చెప్పిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా హామీలు ఇస్తోందని పేర్కొన్న కిషన్ రెడ్డి, కానీ నగరాభివృద్ధిలో ప్రజలకు కనిపించే మార్పు ఏదీ లేదన్నారు. ట్రాఫిక్, నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. 'ఫిట్ ఇండియా-హెల్త్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ప్రారంభించిన ఆయన, ఆరోగ్యక



రమైన జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారుతోందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

# రైతుల ఖాతాల్లో రైతు భరోసా

**ఆదిలాబాద్ మహా :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగు ప్రారంభ దశలోనే ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న రైతు భరోసా వానాకాలం 2026 పథకం కింద విడుదల చేసిన పెట్టుబడి సాయాన్ని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా పథకం అమలుకు సంబంధించిన తాజా గణాంకాలు, నిధుల విడుదల వివరాలను సంబంధిత ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం సకాలంలో చేరేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జూలై 4, 2026 నాటికి ఆదిలాబాద్ జిల్లాలో రైతు భరోసా పథకం కింద మొత్తం 1,44,945 మంది రైతుల ఖాతాల్లో రూ.243.56 కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం జమ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించే సమయంలో రైతులకు పెట్టుబడి కొరత లేకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులను దశలవారీగా విడుదల చేస్తోందన్నారు. ఈ



సాయం రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ అవసరాలను సకాలంలో సమకూర్చుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.నియోజకవర్గాల వారీగా విడుదలైన నిధుల వివరాలను కలెక్టర్ వెల్లడిస్తూ, ఆదిలాబాద్ నియోజకవర్గంలో 39,161 మంది రైతులకు రూ.66.04 కోట్లు, బోథ్ నియోజకవర్గంలో 77,736 మంది రైతులకు రూ.125.95 కోట్లు, ఖానాపూర్ నియోజకవర్గంలో 62,632 మంది రైతులకు రూ.75.30 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.రైతు భరోసా పథకం అమలులో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. నిధుల విడుదలకు సంబంధించిన వివరాలను ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ, బ్యాంకింగ్, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలని సూచించారు.రైతు భరోసా పథకానికి సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైనట్లయితే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు.




# సొసైటీలో ఘనంగా వనమహోత్సవం

**కారేపల్లి, మహా :** కారేపల్లి సొసైటీ నిరంతరం రైతు సేవలో నడుస్తుందని సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సింగరేణ గ్రామ పంచాయతీ సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ)లు అన్నారు. సహకార వారోత్సవాలలో భాగంగా ఆదివారం ప్రత్యేక మహాజన సభ జరిగింది. ఈసభలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సొసైటీ ద్వారా చిత్తశుద్ధితో అమలు జరుగుతున్నాయన్నారు. రైతులకు యూరియా నిరంతరం అందుబాటులో ఉంచుతూ రైతులకు సొసైటీ మరింత చేరువైందన్నారు. 6 యూరియా విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులకు మరింత సేవ చేయటానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పీ.వో) ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్.పీ.వో ద్వారా రైతుల వ్యవసాయ అవసరాలు తక్కువ ఖర్చుతో తీర్చే ఏర్పాటు జరుగుతుందన్నారు. ఎఫ్.పీ.వో ద్వారా పంటలపై తక్కువ ఖర్చుతో పురుగు మందు పిచికారి చేయటానికి డ్రోన్ యంత్రం తీసుకరానున్నట్లు తెలిపారు. ఎఫ్.పీ.వో లో రూ.2వేలు వాటాధనం కట్టి సభ్యులుగా చేరితే కేంద్రప్రభుత్వం మరో రూ.2 వేలు ఇస్తుందని వీటితో రైతుల అవసరాలు తీర్చుతూ సభ్యులుగా ఉన్న వారి లాభాలు పొందవచ్చన్నారు. సంఘంలో రుణాలు తీసుకున్న వారి తప్పనిసరిగా తమ రుణాలను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రెన్యూవల్ చేసుకోక పోతే అధిక వడ్డీ భారం, న్యాయపరమైన చర్యలకు బాధ్యులు అవుతారన్నారు. సకాలంలో వడ్డీలు చెల్లించి 3శాతం వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. అనంతరం సొసైటీ అవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, సొసైటీ డైరక్టర్లు దేగల ఉపేందర్, అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, మధ్యాహ్నపు శ్రీను, వడ్డె ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# ప్రారంభ వేడుకలలో కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం జరిగిన పలు ప్రారంభ వేడుకలలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీ లో నూతనంగా నెలకొల్పిన ఎస్ఎల్ఎన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ,అలాగే ధోబి కాలనీలోని వర్ణ సోలార్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరైన ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ నవీన్ రెడ్డి కి సోలార్ షాప్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ , ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,శాంతన్ రావు, విఠల్ ,ఎంఏ షకీల్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాప్రభుత్వం మేర(దర్జీ) కులానికి అండగా ఉంటుంది

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి జూలై 5 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో నిర్మించిన మేరు కుల సంక్షేమ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్ రాజాంతో కలిసి ఆదివారం ప్రారంభించారు.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీర్ల అయిలయ్యకు మేరు కుల సంక్షేమ భవనం ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తం ట్రస్ట్ సభ్యులతో కలసి ఘన స్వాగతం పలికారు.. అనంతరం భవనంలో నిర్మించిన బ్యాంకట్ హాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మేరకుల సోదరులు ఎంతో కష్టపడి మేర సంక్షేమ భవనం నిర్మాణం చేసుకోవడం చాలా గొప్ప విషయం అన్నారు... ఈ ప్రజా ప్రభుత్వంలో అన్ని కులాలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ ప్రజా పాలనలో మేరకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ నియమించడం చాలా సంతోషం అన్నారు గత ప్రభుత్వాలు మేరకులాన్ని పట్టించుకోలేదని ఈ ప్రజా ప్రభుత్వంలో పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు.. మేరకుల ట్రస్టు సభ్యులు కోరిన విధంగా ఈ భవనం సమీపంలో సిసి రోడ్డు నిర్మాణానికి 10 లక్షల రూపాయలు నిధులు ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో మేర కార్పొరేషన్ కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మేరు కులం దర్జీ వృత్తి మన సంస్కృతి, సంప్రదాయాలు, వస్త్రధారణను కాపాడుతున్న గొప్ప వృత్తి అన్నారు.ప్రతి పండుగ, పెళ్లి, శుభ కార్యంలో దర్జీల సేవలు ఎంతో ముఖ్యమైనవని,ఆధునిక కాలంలో రెడీమేడ్ దుస్తుల వల్ల దర్జీలకు సవాళ్లు పెరిగినా, నాణ్యతతో కూడిన కుట్టు పనికి ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందనన్నారు. యువత ఆధునిక ఫ్యాషన్ డిజైనింగ్, డిజిటల్ టైలరింగ్, బుటిక్ నిర్వహణ వంటి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు.మహిళలు కూడా కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి సాధించి కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడవచ్చన్నారు.ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, రుణాలు, కుట్టు మిషన్ల పంపిణీ వంటి పథకాలను వినియోగించుకోవాలన్నారు. వృత్తిని గౌరవంగా భావించి, నాణ్యమైన సేవలతో కొత్త తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు.. మేరు సమాజ అభివృద్ధికి విద్య, నైపుణ్యం, ఐక్యత, స్వయం ఉపాధి అనే నాలుగు స్తంభాలను బలోపేతం చేయాలన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

**యాదాద్రి భువనగిరి జూలై 5 మహా న్యూస్**యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరంలో ఆదివారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ప్రారంభోత్సవం చేశారు గృహ లబ్ధిదారులు మల్లం ధనమ్మ పాగుడాల వెంకటేశం అలాగే ఖమ్మలపల్లి మధు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం వారిని అభినందించారు





# పోలీసు జాగిలం తనిఖీలు

**ఆదిలాబాద్ మహా:** జిల్లాను మాదకద్రవ్యాలు గంజాయి రహిత జిల్లాగా నిర్మించేందుకు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతంలో సిసిఎస్ బృందం , నార్కోటిక్ జాగిలం రోమా సహాయంతో అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా జాగిలం రోమా వాసన ద్వారా అనుమానాస్పద ప్రదేశాన్ని గుర్తించగా, నిందితుడు గోడెం ఆకాశ్ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 13 ప్యాకెట్లలో సుమారు 39 గ్రాముల గంజాయి లభ్యమవడంతో వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు నమోదు చేసారు. యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 100 లేదా 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, మావల ఎస్సై రాజశేఖర్ రెడ్డి, నార్కోటిక్ జాగిలం హ్యాండ్లర్ రమేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# ఉత్తటూరు పాల సంఘం చైర్మన్‌గా ఎనుగుల వెంకట్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి 5 మహా న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండలం ఉత్త టూరు గ్రామ పాల సంఘం చైర్మన్ గా ఎనుగుల వెంకట్ రెడ్డి ఎంపిక కావడం పట్ల ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పాల సంఘాలు కీలక భూమిక పోషిస్తాయని రైతులు మరియు పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని అభినందనలు తెలిపారు



# గ్రామ అభివృదే ప్రధాన లక్ష్యం

**బాకారం సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలం బాకారం గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎచ్ఎండిఏ నిధులతో చేపట్టిన సిసి రోడ్ పనులను ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి మరియు వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా వార్డు సభ్యులు మరియు గ్రామస్థుల సహకారంతో అందరితో కలిసి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి వార్డు సభ్యులు బంది అనిల్, ఉపేందర్ యాదవ్, కొండకల్ల రవి, మడి దినేశ్ రెడ్డి, మరియు బిక్షపతి గౌడ్, కొండకల్ల శ్రీకాంత్, కొండకల్ల మహేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్థమైతలేదు.. సర్..!

- ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో గందరగోళం
- 2002 నాటి వివరాలు దొరక్క ఓటర్ల ఆందోళన

**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మండలంలోని ఎన్యూమరేషన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ఫారాలు పూరించడం ఓటర్లకు ఇబ్బందికరంగా మారింది. చాలా చోట్ల ఓటర్ల జాబితా సవరణ పై ప్రజలకు అవగాహన ఉండడం లేదు.వార్డు లెవల్లో వివిధ రాజకీయ పార్టీల నేతలు బూత్ లెవల్లో నియమించిన కార్యకర్తల్లో చాలా మందికి సైతం అవగాహన లేనట్లు ఓటర్లు చెబుతున్నారు. ఎక్కడా విస్తృత ప్రచారం కాన రావడం లేదు. దండోరా వేసి ప్రజలను చైతన్య పరుచడం లేదు. మొయినాబాద్ మున్సిపల్, మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు పెట్టాలని ఓటర్లు కోరుతున్నారు. క్యూఆర్ కోడ్ తో ముద్రితమైన ఈ ఫారం లో చిన్న తప్పు చేసినా ఓటు విషయం లో గందరగోళం నెలకొనే పరిస్థితి ఉందని ఓటర్లు చెబుతున్నారు. వారు ఫారాలు ఇచ్చి వెంటనే వెళ్లి పోతున్నారని అవగాహన చేయడం లేదని, ఫారాలు నింపడానికి ఓటర్లు ఇతరులపై ఆధార పడాల్సివస్తోంది.కొరవడిన స్పష్టత..ఇప్పటికే పలు మార్లు బీఎల్వో లు సర్ కు సంబందించిన శిక్షణ తీసుకున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఓటర్లు అడిగే సందేహాలు నివృత్తి చేయలేక మళ్ళీ పై అధికారులను అడిగి చెప్తామనే సందేహాలు వినిపిస్తున్నాయి.2002 ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలు తెలుసు కోవడం ఓటర్లకు సమస్యగా మారింది. బిఎల్వోలకు ఇచ్చిన యాప్ పలు చోట్ల మొరాయిస్తుండడంతో ఇబ్బంది పెరుగుతోంది. నియోజకవర్గం, భాగం సంఖ్య, క్రమ సంఖ్య,బంధుత్వం తదితర వివరాలు ఎలా పొందు పర్చాల అనేది పలు చోట్ల బీఎల్వో లకి తెలియడం లేదు.2002 ఓటర్ల జాబితా లో ఉన్న ఓటర్లు, తాజా ఓటర్లు జాబితా లో ఉన్న ఓటర్లకు ఒకే రకమైన ఫారం ఇస్తున్నారు. ఇందులో వివరాలు వేర్వేరు గా నింపాల్సి ఉంటుంది.ఎక్కువ మందికి అవగాహన లేక పత్రాలను నింపడం లేదు. చాలా మందికి ఎపిక్ నెంబర్ ఎలా తెలుసుకోవాలో తెలియడం లేదు.చాలా చోట్ల ఎన్యూమరేషన్ పత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధులు గా నియమితులు అయిన బీఎల్ వోలు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. బిఎల్వోల ప్రమేయం లేకుండా బిఎల్ఎలు ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేయకుండా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాలు కోరుతున్నాయి. పత్రాల పంపిణీసైతం ప్రభుత్వం నియమించిన బీఎల్ వోలు నిదానంగా కొనసాగిస్తున్నారు.

# కారేపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకులాన్ని సందర్శించిన జోనల్ అధికారి

కారేపల్లి, మహా: కారేపల్లి మండల కేంద్రంలో గల కవిత ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న ఇల్లందు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులాన్ని భద్రాద్రి(ఫోర్త్)జోనల్ అధికారి పోతుల అపర్ణ ఆదివారం సందర్శించారు.ముందుగా వంట శాలకు వెళ్లి నిర్వాహకులతో మాట్లాడి విద్యార్థులకు అందజేస్తున్న మెనూను పరిశీలించారు. అనంతరం తరగతి గదులలోకి వెళ్లి సబ్జెక్టుల వారిగా విద్యార్థుల ప్రతిభను తెలుసుకున్నారు.విద్యార్థుకు అందుతున్న తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు,వసతి గృహాల నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారంవిద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన భోజనం సమయానికి అందుతుందో లేదో తనిఖీ చేశారు.విద్యా ప్రమాణాలు,ఆరోగ్య పరిస్థితులు ,భద్రతా చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆ నుండి మీడియాతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అన్ని గ్రూపులలో తక్షణ ప్రవేశాల (స్పాట్ అడ్మిషన్) ను కల్పించుటకు గాను సోమవారం ఖమ్మం జిల్లా వారికీ తిరుమలయపాలెంలో బాలురు, టేకులపల్లిలో బాలికలకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి లో బాలురకు, ములకలపల్లిలో బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గురుకుల సంక్షేమ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్యార్థులకి ఎటువంటి అసౌకర్యాలు కలిగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు,నాణ్యత ప్రమాణాలను పాటిస్తుందన్నారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపల్ వాణి, వైస్ ప్రిన్సిపల్ రత్న లత, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

# భూ వికేంద్రీకరణే దేశాభివృద్ధికి పునాది

- -భూ సీలింగ్ చట్టాల సమీక్షతో భూమిలేని పేదలకు హక్కులు కల్పించాలి
- నాటి క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా " జైల్ భరో " కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పిలుపు



**యాదాద్రి భువనగిరి జూలై 5 మహా** భూ వికేంద్రీకరణే దేశాభివృద్ధికి పునాదని, భూ సీలింగ్ చట్టాల సమీక్షతో భూమిలేని పేదలకు హక్కులు కల్పించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ జరగాలని, కౌలుదారులకు హక్కులు కల్పించాలని, జి రామ్ జి చట్టం రద్దు చేయాలని, పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న " జైల్ భరో " కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు కమ్యూనిస్టుల నాయకత్వంలో చారిత్రక పోరాటాన్ని సాగించారని తెలిపారు. ఆ పోరాటం వల్ల భూ సంస్కరణలపై చర్చ ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ భూమి కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండడం ఆందోళనకరమన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న భూ గరిష్ట పరిమితి (ల్యాండ్ సీలింగ్) చట్టాలను సమూలంగా పునః సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో సాగునీటి వసతులు లేని పరిస్థితుల్లో ఒక కుటుంబానికి పెద్ద ఎత్తున భూమి కలిగి ఉండేందుకు అవకాశం కల్పించారని, అయితే ఇప్పుడు ప్రాజెక్టులు, సాగునీటి సదుపాయాలు పెరిగిన పరిస్థితుల్లో అదే విధానాన్ని కొనసాగించడం సమంజసం కాదన్నారు. అసైన్మెంట్ భూములను సాగు చేస్తున్న వారికి పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలుదారులకు కూడా రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ ఆర్థికాభివృద్ధి భారీ నగరాల నిర్మాణంతో కాకుండా ప్రజల కొనుగోలు శక్తి పెరగడం ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. అందుకు భూ వికేంద్రీకరణ తప్పనిసరి అని అన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఆగస్టు 10న "జైల్ భరో '' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్పొరేట్ సంస్థలు దేశ సహజ వనరులను క్రమంగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయని విమర్శించారు. ఒకప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీ దేశ సంపదను దోచుకెళ్లిందని, నేడు స్వదేశీ పేరుతో పనిచేస్తున్న పెద్ద కార్పొరేట్ సంస్థలు విదేశీ పెట్టుబడిదారులతో కలిసి అదే తరహా దోపిడీని కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సుమారు 40 లక్షల మంది క్రియాశీల జాబ్ కార్డు కలిగిన కార్మికులు ఉన్నారని వారికి ఉపాధి కల్పించేందుకు కనీసం రూ.5,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని కోరారు. కేంద్రం అమలు చేస్తున్న ఆన్‌లైన్ హాజరు, రోజుకు రెండుసార్లు హాజరు నమోదు వంటి నిబంధనలు కార్మికులకు ఇబ్బందికరంగా మారాయని వాటిని వెంటనె ఉపసంహరించాలన్నారు. గ్రామాలను కేవలం కాగితాలపై పట్టణాలుగా ప్రకటిస్తూ తగిన మౌలిక వసతులు కల్పించడం లేదని ఆయన విమర్శించారు. దీనివల్ల గ్రామీణ ప్రజలు ఉపాధి హామీ పథకం వంటి కీలక సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసే చర్యలు నూతన విద్యా విధానంలో భాగమేనని తెలిపారు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్నట్లు కనిపించినప్పటికీ అమలులో మాత్రం అదే విధానాలను అనుసరిస్తున్నారని వారు ఆరోపించారు. కార్మికుల పని గంటల పెంపు, అసైన్‌మెంట్ భూముల అంశం వంటి నిర్ణయాలు కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. రిజర్వేషన్లు, దళితులు, గిరిజనుల హక్కుల అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం మరింత చొరవ చూపాలని ఆయన కోరారు. అలాగే వ్యవసాయ కార్మికులపై ప్రభావం చూపే ' క్రాప్ హాలిడే ' విధానాన్ని పునఃపరిశీలించి ఆ రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమి, ఉపాధి, విద్య, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలందరినీ సంఘటితం చేస్తూ ఆగస్టు 10న నిర్వహించే ' జైల్ భరో ' కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వెంకట్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లెల పెంటయ్య, కొండమడుగు నర్సింహ్మా, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు పాల్గొన్నారు.



# కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**నూతన కమిటీ సభ్యులకు సన్మానం త్వరలో పర్యటిస్తానని హామీ**

కుషాయిగూడ, మహా : కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జె. సుధాకర్, కార్యదర్శి అఖిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో కాలనీలో విద్యుత్, డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఫాగింగ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలోని మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో కాలనీలో పర్యటించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మహేష్ గౌడ్, కాలనీ ఉపాధ్యక్షుడు బి. కృష్ణ, సహాయ కార్యదర్శులు మునీర్, మలేష్, ఖజాంచి ఎ. శ్రీనివాస్, కమిటీ సభ్యులు రాజేష్, శ్రీనివాస్, మాదేశ్, హరీష్, రామస్వామితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



# టీజీ మైనారిటీస్ విద్యాలయాల తనిఖీ

**వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా నర్సంపేట లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని (విద్యాలయాలను) జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, పరిశుభ్రత, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్లో వంట సామాగ్రి నిల్వలు, వంటగది శుభ్రంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పిల్లలకు లాంగ్వేజ్ ఇంప్రూవ్ చేయుటలో 3 రోజులు మూడు భాషలను అనగా తెలుగు,హిందీ, ఇంగ్లీష్ భాషలను ఉపయోగించేలా చూడాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. విద్యార్థులు నాణ్యమైన విద్యా, ఆహారం పరిసరాల పరిశుభ్రత తదితర 5 అంశాల పై కమిటీలు వేయాలని, ఈ కమిటీలలో ఇద్దరిద్దరూ విద్యార్థినులను ఉండేలా మెంబర్లుగా చేర్చి పర్యవేక్షణ చేయుటకు పిల్లల కమిటి వేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ తనిఖీ లో డిబిసిడిఓ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతోనే సింగరేణి

# మండల అభివృద్ధికి బాటలు

**కారేపల్లి,మహా**:అధికారుల మధ్య సమన్వయం లేక గత రెండేళ్లుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సింగరేణి మండల పరిషత్ కార్యాలయానికి మంచి రోజులు వచ్చాయనే మాటలు వినిపిస్తున్నాయి. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో పద్మ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సింగరేణి మండల పరిషత్ కార్యాలయం లో అధికారుల మధ్య గత రెండేళ్లుగా సమన్వయం లేదనే విషయం బహిరంగ రహస్యమే. గతంలో ఇక్కడ పనిచేసే వెళ్లిన ఇద్దరు ఎంపీడీవోలతో ఎంపీవో కు సంబంధాలు అంతంత మాత్రమే అని అందరికీ తెలిసిన విషయమే. గత ఎంపీడీవోకు ఎంపీఓ కు కొంతకాలం మాటలు కూడా లేని విషయం కూడా మండలంలో చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితిలో ఉన్న మండలానికి గతంలో ఉమ్మడి వరంగల్ జిలాలో ఎంపీవో

- అన్ని శాఖల సమన్వయంపై దృష్టి సారించిన ఎంపీడీవో పద్మ
- వృత్తిపరమైన అనుభవంతో లేడీ బాస్ అన్నింటికీ చెక్ పెడతారా?

గా పనిచేసి ప్రమోషన్ తో ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన పద్మ క్షేత్రస్థాయిలో పని చేసి అన్ని రకాలుగా అనుభవం కలిగిన అధికారిగా తనదైన శైలిలో మండలపరిషత్ ను గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఎంపీడీవో, ఎంపీవో గదుల మధ్య సంబంధాలు దూరమయ్యాయి... మండల పరిషత్ వ్యవస్థ ఏర్పడ్డ



నాటి నుంచి సింగరేణి మండలపరిషత్ కార్యాలయానికి ఎండీవో ఒక్కరే బాస్ గా ఉండేది.గత రెండేళ్లుగా సింగరేణి మండల పరిషత్ కార్యాలయానికి ఇద్దరు బాస్ లు గా వాతావరణం ఏర్పడింది. ఎంపీవో సంఘ నాయకుడు కావడం, నాయకత్వ లక్షణాలు కూడా పుష్కలంగా ఉండి సమర్థవంతమైన అధికారిగా వ్యవహరించడంతో మండల ఆఫీస్ లో తేడాలు బట్టబయలయ్ అనేక ఆరోపణలకు దారితీసింది.

**కార్యదర్శులు అంతా ఎంపీఓ గదికే...**

సింగరేణి మండలంలో 41 గ్రామపంచాయతీలు ఉండగా ఇక్కడ పనిచేసే జిపి కార్యదర్శులు అంతా గత రెండేళ్లుగా ఎంపీఓ కనుసన్నల్లోనే పనిచేశారనేది అందరికీ తెలిసిందే.. కొందరు కార్యదర్శులు ఎంపీవో గది వరకే పరిమితమై ఎంపీడీవో గది వైపు చూడని సందర్భాలు అనేకం. దీని వల్ల జీపీ కార్యదర్శులు కూడా అవకాశవాదం గా తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో కీలకంగా వ్యవహరించాల్సిన సెక్రటరీలు మండల పరిషత్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల భాగ్యనగర్ తండా జీపీ సెక్రటరీ ఏకంగా ఫోన్ పే ద్వారా అక్రమంగా డబ్బులు వసూలు చేసే స్థాయికి వెళ్లడం కూడా అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

**కీలకంగా కంప్యూటర్ ఆపరేటర్లు...**

మండలపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు కూడా కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం క్లస్టర్ల వారీగా విధులు నిర్వర్తించాల్సిన కంప్యూటర్ ఆపరేటర్లు అందరూ మండలపరిషత్ ఆఫీస్ లోనే తిష్ట వేయడంతో వీరి వ్యవహరించే తీరు పట్ల కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రకరకాల సమస్యలతో సతమత మవుతున్న సింగరేణి మండల పరిషత్ కార్యాలయాన్ని గాడిలో పెట్టడం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో పద్మ కు సవాల్ గా మారినప్పటికీ ఎంపీ ఓను సమన్వయం చేసుకుంటూ పనులు సమర్థవంతంగా నిర్వర్తించాలనే ఆలోచన మండలానికి మేలు జరిగే పరిణామంగా భావించవచ్చని పలువురు



## ఓటర్ల జాబితాలో... అర్హుల పేర్లను

# తొలగించకుండా ప్రత్యేక చర్యలు

- బిఎల్వోలతో కలిసి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ.
- బిజెపి మేడ్చల్ కౌన్సిల్ సభ్యుడు ఫంగిశెట్టి రవీంద్రసాగర్.

**కుషాయిగూడ, మహా** : ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లను తొలగించకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని బిఎల్ఓలతో కలిసి ఏన్యుమరేషన్ ఫారాలు సక్రమంగా పంపిణీ చేద్దామని బిజెపి మేడ్చల్ కౌన్సిల్ సభ్యుడు ఫంగిశెట్టి రవీంద్రసాగర్ పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ లో బిజెపి నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా బిజెపి మేడ్చల్ కౌన్సిల్ సభ్యుడు శక్తి కేంద్రాల ఇన్చార్జ్ రవీంద్రసాగర్ మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నమని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. సమగ్ర ఓటర్ సర్వే కార్యక్రమంలో భాగంగా బూత్ నెంబర్లు 151, 153, 154 ,155, 156 పరిధిలో బిఎల్ఓ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లిన పారాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఓటర్ల వివరాల ధ్రువీకరణ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి పౌరుని ఓటు హక్కును కాపాడేందుకు బిజెపి ఎల్లప్పుడు కట్టుబడి ఉందని రవీంద్ర సాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకురాలు శశికళ, మహిళా మోర్చా అధ్యక్షురాలు సబితా యాదవ్, ఉత్తరం మాదాక్షి, ఏ .లింగేశ్వర్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి మయమైన నెహ్రూనగర్

- వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం
- తుజ్జా భవాని ఆలయంలో ఆధ్యాత్మిక శోభ
- కుటుంబ సమేతంగా భారీగా భక్తుల హాజరు



**కుషాయిగూడ, మహా** : కాప్రా సర్కిల్ నెహ్రూ నగర్ కాలనీలో భక్తి వాతావరణం వెల్లివిరిసింది. కాలనీలోని శ్రీ తుజ్జా భవాని ఆలయంలో శనివారం సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాన్ని భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానికుల స్వచ్ఛంద భాగస్వామ్యంతో కొనసాగుతున్న ఈ శనివారపు ఆధ్యాత్మిక కార్యక్రమం 14వ వారానికి చేరిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పవని మణిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతకు, సమాజ శ్రేయస్సుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రతి శనివారం జరిగే హనుమాన్ చాలీసా పారాయణం ద్వారా ఐకమత్యం, సోదరభావం పెరుగుతుందని అన్నారు.భజన కార్యక్రమానికి కాలనీవాసులు, పరిసర ప్రాంతాల భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఏకకంఠంతో పారాయణం చేయడంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం భజనలు, సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పెంచాల సురేందర్ రావు, పాతకోటి రామలింగం, సింగం కిరణ్, ప్రకాష్, అరుణ్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ రాజేష్, గుడి చైర్మన్ శ్రీహరి నాయుడు, తౌటం రాజు, రమేష్, వేణు, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు బస్తీదావకానాలు వరం

- బస్తీ దవాఖాన విస్తరణ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ , మహా** : పేద ప్రజలకు బస్తీ దవాఖానాలు ఒక వరం లాంటిది అని, వైద్య సేవలను అందరూ వినియోగించుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఏఎస్‌రావు నగర్‌లోని బస్తీ దవాఖాన విస్తరణ భవనాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. బస్తీ దవాఖానల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ప్రజా మరుగుదొడ్ల నిర్మాణంతో పరిశుభ్రత పెరిగి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, కె. సోమశేఖరరావు, జి. వీరయ్య, ఐ. శివశంకరరావు, ఎస్. శంకరరావు, ఎ. వెంకటేశ్వరరావు, సి. చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్యులు పాల్గొన్నారు. ఏఎస్ రావు నగర్ పరస్పర సహకార సమైక్య సభ్యులు 20 లక్షల రూపాయల విరాళాలు రిటైర్డ్ ఉద్యోగుల నుంచి సేకరించి బస్తీ దావకానన్ను మరింత అభివృద్ధి పరిచేందుకు వారు చేసిన కృషిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అభినందించారు కాలనీవాసులకు బస్తీ దావకాన ఎంతో ఉపయోగపడుతుందని పరస్పర సహకార సమైక్య సభ్యులు సోమశేఖర రావు శంకర్రావు ఏ వెంకటేశ్వరరావు వీరయ్య శివశంకర్ ఏ చంద్రశేఖర్ అన్నారు. రానున్న కాలంలో బస్తీ దావకానను దాతల సహకారంతో మరింత అభివృద్ధి పరుస్తామన్నారు



# అపోలో మైక్రోపై ఇన్వెస్టర్ల దృష్టి

**హైదరాబాద్, మహా:** రక్షణ, అంతరిక్ష రంగానికి చెందిన ప్రముఖ సంస్థ అపోలో మైక్రో సిస్టమ్స్ షేర్లు మరోసారి పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన కొత్త నిధుల సమీకరణపై జూలై 6న జరిగే బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ట్రేడింగ్‌లో కంపెనీ షేరు 2.39 శాతం లాభంతో ముగిసింది. హైదరాబాద్‌లోని సంస్థ నమోదిత కార్యాలయంలో నిర్వహించే బోర్డు సమావేశంలో ఈక్విటీ షేర్లు, కన్వర్టిబుల్ సెక్యూరిటీలు లేదా వారెంట్ల జారీ ద్వారా నిధుల సమీకరణ ప్రతిపాదనను పరిశీలించనున్నారు. మార్కెట్ నియంత్రణ సంస్థ నిబంధనల ప్రకారం షేర్ల ధర, ఇతర షరతులను ఖరారు చేయనున్నారు. ఇందుకు వాటాదారులు, నియంత్రణ సంస్థల అనుమతులు అవసరం.

ఈ కంపెనీ షేరు గత ఐదేళ్లలో ఏకంగా 3,847 శాతం రాబడిని అందించింది. ఐదేళ్ల క్రితం రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ప్రస్తుతం రూ.39 లక్షలకు పైగా విలువ లభించినట్లవుతుంది. గత మూడు నెలల్లో 128 శాతం, ఏడాదిలో 136 శాతం, మూడేళ్లలో 803 శాతం లాభాలు అందించి మల్టీబ్యాగర్‌గా నిలిచింది.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కూడా కంపెనీపై విశ్వాసం పెంచుకుంటున్నారు. వారి వాటా మార్చి త్రైమాసికంలో 3.63 శాతం ఉండగా, జూన్ నాటికి 6.21 శాతానికి పెరిగింది. ప్రస్తుతం ప్రమోటర్ల వాటా 50.27 శాతంగా ఉంది.

అపోలో మైక్రో సిస్టమ్స్ రక్షణ శాఖతో పాటు రక్షణ పరిశోధన, అంతరిక్ష సంస్థలు, ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలకు కీలక ఎలక్ట్రానిక్ వ్యవస్థలను సరఫరా చేస్తోంది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.1,432 కోట్ల విలువైన ఆర్డర్లు ఉండటంతో రానున్న రోజుల్లో ఆదాయం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నిధుల సమీకరణకు సంబంధించిన గోప్య సమాచారం బయటకు వెళ్లకుండా ఉండేందుకు జూలై 1 నుంచి ఉద్యోగులు, ఉన్నతాధికారుల షేర్ల కొనుగోలు, విక్రయాలపై సంస్థ తాత్కాలికంగా నిషేధం విధించింది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ.16,336 కోట్లుగా ఉండగా, అప్పుల భారం స్వల్పంగానే ఉందని ఆర్థిక గణాంకాలు సూచిస్తున్నాయి.

# టచ్‌స్క్రీన్ డిస్‌ప్లేతో అదిరే ఈ–స్కూటర్లు

**న్యూఢిల్లీ, మహా:** దేశంలో ఎలక్ట్రిక్ స్కూటర్లకు ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా ఆధునిక సాంకేతికత, ఎక్కువ ప్రయాణ సామర్థ్యం, స్మార్ట్ అనుసంధాన సదుపాయాలు కోరుకునే వినియోగదారులు టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే కలిగిన మోడళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దారి చూపే పటాలు, కాల్ హెచ్చరికలు, సంగీత నియంత్రణ, నావిగేషన్ వంటి సౌకర్యాలతో ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తున్న ఈ స్కూటర్లు మార్కెట్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో లభ్యమవుతున్న టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే కలిగిన ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ల వివరాలు ఇవి.



**సింపుల్ వన్**

ఎక్కువ ప్రయాణ సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ స్కూటర్లలో సింపుల్ వన్ ముందంజలో ఉంది. దీని ప్రారంభ ధర రూ.1,89,999. ఇందులో 7 అంగుళాల టచ్‌స్క్రీన్, గూగుల్ పటాల ఆధారిత దారి చూపే సదుపాయం, కాల్, సంగీత నియంత్రణ, స్మార్ట్‌వాచ్ అనుసంధానం ఉన్నాయి. 5.0 కిలోవాట్ గంటలు, 4.5 కిలోవాట్ గంటల బ్యాటరీ ఎంపికలతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 265 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు.

**ఓలా ఎస్–1 ప్రో (మూడో తరం)**

ఓలా సంస్థకు చెందిన అత్యంత ప్రజాదరణ పొందిన మోడళ్లలో ఇది ఒకటి. దీని ప్రారంభ ధర రూ.1,14,999. 7 అంగుళాల టచ్‌స్క్రీన్, కొత్త సాఫ్ట్‌వేర్ వ్యవస్థ, గూగుల్ పటాల సదుపాయం, కాల్, సంగీత నియంత్రణ వంటి ఫీచర్లు ఉన్నాయి. పూర్తి ఛార్జ్‌తో గరిష్ఠంగా 242 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది.

**ఏథర్ 450 ఎక్స్**

ప్రీమియం విభాగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ స్కూటర్ ధర రూ.1,73,046. 7 అంగుళాల టచ్‌స్క్రీన్, గూగుల్ పటాలు, అలెక్సా మద్దతు, కాల్, సంగీత నియంత్రణ, మొబైల్ మాదిరి టచ్, స్క్రోల్ అనుభవం దీని ప్రత్యేకతలు. ఒక్కసారి ఛార్జ్‌తో గరిష్ఠంగా 161 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది.

**టీవీఎస్ ఐక్యూబ్ ఎస్‌టీ**

టీవీఎస్ సంస్థ నుంచి వచ్చిన ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్ ఇది. ప్రారంభ ధర రూ.1.71 లక్షలు. 7 అంగుళాల టచ్‌స్క్రీన్, బటన్ నియంత్రణ, 3.5 కిలోవాట్ గంటలు, 5.3 కిలోవాట్ గంటల బ్యాటరీ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. పెద్ద బ్యాటరీతో గరిష్ఠంగా 212 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు.

**ఏథర్ రిజ్టా**

కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1,39,045. 7 అంగుళాల టచ్ డాష్‌బోర్డ్, స్వైప్, జూమ్ సదుపాయాలు, స్మార్ట్ అనుసంధాన ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఒక్కసారి ఛార్జ్‌తో గరిష్ఠంగా 159 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని అందిస్తుంది.

# లేజర్ పవర్ ఐపీఓ పరిమాణం తగ్గింపు

**రూ.742 కోట్లతో జూలై 9న ప్రారంభం.. రుణాల చెల్లింపుకే నిధుల వినియోగం**

**ముంబై, మహా:** విద్యుత్ మౌలిక సదుపాయాల రంగానికి చెందిన లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ తన ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) పరిమాణాన్ని రూ.1,200 కోట్ల నుంచి రూ.742 కోట్లకు తగ్గించింది. సవరించిన ప్రణాళిక ప్రకారం జూలై 9న ఐపీఓ ప్రారంభమై జూలై 13 వరకు పెట్టుబడిదారులకు అందుబాటులో ఉంటుంది.

కంపెనీ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం, ఐపీఓలో రూ.542 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు, ప్రస్తుత ప్రమోటర్లు రూ.200 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.490 కోట్లను ప్రస్తుత రుణాల చెల్లింపు లేదా ముందస్తు చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. రుణభారం తగ్గించడం ద్వారా ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేసుకుని భవిష్యత్ విస్తరణకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

విద్యుత్ ప్రసార, పంపిణీ రంగానికి అవసరమైన విద్యుత్ కేబుళ్లు, కండక్టర్లు, ప్రత్యేక ఉత్పత్తుల తయారీలో లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లోని మూడు తయారీ కేంద్రాల ద్వారా ఏటా 85 వేల మెట్రిక్ టన్నులకుపైగా ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. విద్యుత్ మౌలిక సదుపాయాల రంగంలోని అనేక సంస్థలకు సరఫరాలు అందిస్తూ గణనీయమైన ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది. గత కొన్నేళ్లుగా కంపెనీ ఆదాయం, లాభదాయకతలో స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణతో పాటు దేశంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెరుగుతున్న పెట్టుబడులు కంపెనీ భవిష్యత్ వృద్ధికి అనుకూలంగా మారనున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఐపీఓ ధరల శ్రేణిని జూలై 6న ప్రకటించనుండగా, యాంకర్ పెట్టుబడిదారుల కోసం జూలై 8న ప్రత్యేక కేటాయింపు జరగనుంది. షేర్ల కేటాయింపును జూలై 14న ఖరారు చేసి, నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి జూలై 16న బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్ల లిస్టింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ ఐపీఓకు ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ప్రధాన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తుండగా, ఎంయూఎఫ్‌జీ ఇంటైమ్ ఇండియా రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తోంది. ధరల శ్రేణి ప్రకటించిన అనంతరం ఐపీఓకు లభించే స్పందనపై మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# బ్లూస్ప్రింగ్ షేర్ల జోరు


**మూడు నెలల్లో 112 శాతం రాబడి.. భారీ కాంట్రాక్టులతో దూసుకెళ్తున్న కంపెనీ**

**ముంబై, మహా:** భారత స్టాక్ మార్కెట్లో మరో మల్టీబ్యాగర్ షేరు పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. బ్లూస్ప్రింగ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ షేరు గత మూడు నెలల్లోనే సుమారు 112 శాతం పెరిగి ఇన్వెస్టర్లకు భారీ లాభాలను అందించింది. కంపెనీకి వరుసగా భారీ కాంట్రాక్టులు లభించడంతో ఈ షేరుపై మార్కెట్లో కొనుగోళ్ల ఆసక్తి పెరిగింది.

బ్లూస్ప్రింగ్ అనుబంధ సంస్థ స్టీగ్ ఎనర్జీ సర్వీసెస్‌కు వేదాంత అల్యూమినియం నుంచి రూ.1,437 కోట్ల విలువైన ఐదేళ్ల పవర్ ప్లాంట్ నిర్వహణ కాంట్రాక్టు లభించింది. అంతకుముందు కూడా వేదాంత నుంచి రూ.1,219 కోట్లు, రూ.406 కోట్ల విలువైన నిర్వహణ ఒప్పందాలను దక్కించుకోవడంతో కంపెనీ ఆర్డర్ బుక్ మరింత బలపడింది. ఈ పరిణామాలు భవిష్యత్తు ఆదాయ వృద్ధిపై పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి.

మరోవైపు ప్రముఖ పెట్టుబడిదారుడు ఆశిష్ ధావన్ కంపెనీలో తన వాటాను 6.30 శాతానికి పెంచుకోవడం కూడా సానుకూల సంకేతంగా మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రస్తుతం రూ.1.86 వేల కోట్ల మార్కెట్ విలువ కలిగిన బ్లూస్ప్రింగ్ ఎంటర్‌ప్రైజెస్ ఫెసిలిటీ నిర్వహణ, టెలికాం, విద్యుత్ సేవల రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఈ షేరు రూ.124.50 వద్ద ట్రేడవుతుండగా, భారీ ఆర్డర్లతో కంపెనీ వృద్ధి అవకాశాలు మెరుగుపడటంతో రిటైల్ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.






# ప్రపంచ కార్పొరేట్ శిఖరాలపై భారత మేధస్సు

**అంతర్జాతీయ సంస్థలకు భారతీయులే దిక్సూచి**

ఢిల్లీ, మహా: ఒకప్పుడు ప్రపంచ స్థాయి సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం భారతీయ యువతకు గొప్ప విజయంగా భావించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న బహుళజాతి సంస్థల అత్యున్నత పదవుల్లో భారతీయ మూలాలు కలిగిన నాయకులు వరుసగా బాధ్యతలు చేపడుతూ ప్రపంచవ్యాప్తంగా తమ మేధస్సు, నాయకత్వ సామర్థ్యాన్ని చాటుతున్నారు. సమాచార సాంకేతిక రంగం నుంచి బ్యాంకింగ్, ఔషధాలు, సైబర్ భద్రత, లగ్జరీ బ్రాండ్లు, మీడియా, కృత్రిమ మేధ, ప్రపంచ ఆర్థిక సంస్థల వరకు భారతీయ మూలాల నాయకత్వం బలంగా విస్తరించడం ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తోంది.

ప్రపంచంలోనే అతిపెద్ద సాంకేతిక సంస్థల్లో ఒకటైన ఆల్ఫాబెట్‌కు సుందర్ పిచై నాయకత్వం వహిస్తుండగా, మైక్రోసాఫ్ట్‌కు సత్య నాదెళ్ల ఛైర్మన్, ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా కొనసాగుతున్నారు. ఐబీఎంకు అరవింద్ కృష్ణ, అడోబ్‌కు శంతను నారాయణ్, యూట్యూబ్‌కు నీల్ మోహన్ నాయకత్వం వహిస్తూ ప్రపంచ డిజిటల్ రంగంలో భారతీయ మేధస్సు సత్తా చాటుతున్నారు.

సైబర్ భద్రత రంగంలో పాలో ఆల్టో నెట్‌వర్క్స్‌కు నికేశ్ అరోరా, క్లౌడ్ భద్రత సంస్థ జెడ్‌స్కేలర్‌కు వ్యవస్థాపకుడు జయ్ చౌదరి, డేటా నిర్వహణ సంస్థ నెట్‌యాప్‌కు జార్జ్ కురియన్, ఇన్ఫర్మాటికాకు అమిత్ వాలియా నాయకత్వం వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ భద్రతకు సంబంధించిన కీలక నిర్ణయాల్లో భారతీయ మూలాల నాయకుల పాత్ర మరింత పెరుగుతోంది.


కృత్రిమ మేధ ప్రపంచాన్ని శాసిస్తున్న వేళ పెర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థను భారతీయ మూలాల యువ పారిశ్రామికవేత్త అరవింద్ శ్రీనివాస్ ముందుకు నడిపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో పెరుగుతున్న పోటీలో భారతీయుల ఆలోచనా శక్తి కీలకంగా మారుతున్నదనే అభిప్రాయం పరిశ్రమ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ప్రపంచ బ్యాంకు గ్రూప్ అధ్యక్షుడిగా అజయ్ బంగా సేవలందిస్తుండటం భారతదేశానికి మరో గర్వకారణంగా నిలిచింది. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పేదరిక నిర్మూలన వంటి అంశాల్లో ఆయన నాయకత్వం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది.

వ్యాపార ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక బ్రాండ్లలో ఒకటైన షానెల్‌కు లీనా నాయర్ గ్లోబల్ సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఫెడెక్స్‌కు రాజ్ సుబ్రమణ్యం, హనీవెల్‌కు విమల్ కపూర్, మైక్రాన్ టెక్నాలజీకి సంజయ్ మెహ్రోత్రా, నోవార్టిస్‌కు వసంత్ నరసింహన్, అరిస్టా నెట్‌వర్క్స్‌కు జయశ్రీ ఉల్లాల్, కాగ్నిజెంట్‌కు రవి కుమార్ ఎస్, వెర్టెక్స్ ఫార్మాస్యూటికల్స్‌కు రేష్మా కేవల్‌రమణి, ఫ్లెక్స్‌కు రేవతి అద్వైతి, ఓగిల్వీకి దేవికా బుల్చందాని, వేఫెయిర్‌కు నిరాజ్ షా, ట్యూబీకి అంజలి సుద్ వంటి భారతీయ మూలాల నాయకులు తమ తమ రంగాల్లో విశేష గుర్తింపు పొందుతున్నారు.

నాణ్యమైన విద్య, సాంకేతిక నైపుణ్యం, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, బహుళ సాంస్కృతిక వాతావరణంలో పనిచేసే అనుభవం, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం భారతీయ నాయకత్వాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్న అంశాలుగా చెబుతున్నారు.

ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన సంస్థల నిర్ణయాత్మక స్థానాల్లో భారతీయ మూలాల నాయకులు వరుసగా బాధ్యతలు చేపడుతుండటం భారత యువతకు కొత్త స్ఫూర్తినిస్తోంది. "ప్రపంచ స్థాయి సంస్థల్లో ఉద్యోగం" అనే లక్ష్యం నుంచి "ప్రపంచ స్థాయి సంస్థలకు నాయకత్వం" అనే స్థాయికి భారత మేధస్సు చేరుకోవడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత ప్రతిభ పెరుగుతున్న ప్రభావానికి నిదర్శనంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారతీయ మూలాలు కలిగిన ఈ నాయకుల విజయాలు ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నాయని అంతర్జాతీయ వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# రుచుల రాజధానిగా ముంబై

- **ప్రపంచ వంటకాల పటంలో భారత రుచి వైభవం.**
- **హైదరాబాద్‌కు ప్రపంచ టాప్-50లో స్థానం.**

**ఢిల్లీ, మహా :** ప్రపంచాన్ని ఒక్కటిగా కట్టిపడేసే శక్తి ఏదైనా ఉందంటే అది ఆహార సంస్కృతే. భాషలు వేరైనా, సరిహద్దులు మారినా, సంప్రదాయాలు భిన్నమైనా రుచుల ముందు ప్రపంచం ఒక్కటవుతోంది. పర్యాటక రంగంలోనూ ఇప్పుడు చారిత్రక కట్టడాల కంటే స్థానిక వంటకాల అనుభవానికే ఎక్కువ ప్రాధాన్యం పెరుగుతోంది. అలాంటి సమయంలో ప్రపంచంలోని అత్యుత్తమ ఆహార నగరాల జాబితా వెలువడగా, భారతీయ వంటకాల ఘనత మరోసారి అంతర్జాతీయ వేదికపై మార్మోగింది. ప్రపంచంలోని వంద అత్యుత్తమ ఆహార నగరాల్లో ఏకంగా ఐదు భారతీయ నగరాలు చోటు దక్కించుకోవడం భారతీయ వంటల వైవిధ్యానికి ప్రపంచం ఇస్తున్న గౌరవానికి నిదర్శనంగా నిలిచింది.

ప్రపంచ ప్రఖ్యాత ఆహార మార్గదర్శక వేదిక విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ముంబై ప్రపంచంలోనే ఐదో అత్యుత్తమ ఆహార నగరంగా నిలిచి భారతదేశానికి గర్వకారణమైంది. ఇటలీకి చెందిన నేపుల్స్, మిలాన్, బొలోనియా, ఫ్లోరెన్స్ నగరాల తర్వాత ముంబై నిలవడం విశేషం. లక్షలాది మంది ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే వీధి ఆహారం నుంచి ప్రపంచ స్థాయి రెస్టారెంట్ల వరకు విస్తరించిన ముంబై ఆహార సంస్కృతి అంతర్జాతీయ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇది కేవలం ముంబై విజయమే కాదు. అమృత్‌సర్ 43వ స్థానంలో, న్యూఢిల్లీ 45వ స్థానంలో, హైదరాబాద్ 50వ స్థానంలో, కోల్‌కతా 71వ స్థానంలో, చెన్నై 75వ స్థానంలో నిలవడం భారతీయ వంటకాల విశిష్టతను ప్రపంచానికి మరోసారి చాటిచెప్పింది. ఉత్తర భారత మసాలా రుచులు, దక్షిణాది సంప్రదాయ వంటలు, దక్కన్ వంటకాల ఘుమఘుమలు, బెంగాలీ మిఠాయిల మాధుర్యం, పంజాబీ ఆతిథ్య సంస్కృతి... ఇలా భారతదేశంలోని ప్రతి ప్రాంతం తన ప్రత్యేకతతో ప్రపంచ రుచుల పటంలో స్థానం సంపాదించుకుంది.

ఈ జాబితాలో ఇటలీ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. టాప్10లోనే నేపుల్స్, మిలాన్, బొలోనియా, ఫ్లోరెన్స్, రోమ్, టూరిన్ వంటి ఆరు ఇటాలియన్ నగరాలు నిలవగా, మొత్తం టాప్100లో దాదాపు పదిహేనుకు పైగా ఇటలీ నగరాలు చోటు దక్కించుకున్నాయి. పాస్తా, పిజ్జా, రిసోటో, ప్రాంతీయ సంప్రదాయ వంటకాలతో ఇటలీ ప్రపంచ ఆహార రాజధానిగా తన స్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది.



ఫ్రాన్స్‌కు చెందిన పారిస్, నీస్, లియోన్, మార్సెయ్ నగరాలు, జపాన్‌కు చెందిన ఒసాకా, క్యోటో, టోక్యో, సప్పోరో నగరాలు కూడా జాబితాలో విశిష్ట స్థానాలు దక్కించుకున్నాయి. స్పెయిన్‌కు చెందిన మాడ్రిడ్, బార్సిలోనా, వాలెన్సియా, సెవిల్లే, కోర్డోబా, సాన్ సెబాస్టియన్ నగరాలు యూరోపియన్ వంటల వైవిధ్యాన్ని ప్రతిబింబించాయి.

అమెరికా కూడా న్యూయార్క్, న్యూఆర్లియన్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, చికాగో, ఫిలడెల్ఫియా, లాస్ ఏంజెలెస్, బోస్టన్, వాషింగ్టన్, శాన్ ఆంటోనియో, హ్యూస్టన్, హోనోలులు, చార్లెస్టన్ వంటి నగరాలతో బలమైన ఉనికిని చాటుకుంది. ఆసియా నుంచి సింగపూర్, బ్యాంకాక్, జకార్తా, బాండుంగ్, సురబయా, యోగ్యకర్త, పదాంగ్, సురకర్త, షాంఘై, బీజింగ్, హాంకాంగ్, మకావు వంటి నగరాలు కూడా ప్రపంచ ఆహార ప్రియులను ఆకర్షిస్తున్నాయి.

భారతీయ నగరాల్లో ముంబై స్థానం ప్రత్యేకంగా నిలిచింది. వడపావ్ నుంచి పవ్‌భాజీ వరకు, బాంబే శాండ్‌విచ్ నుంచి సముద్ర ఆహారం వరకు, మహారాష్ట్ర సంప్రదాయ వంటల నుంచి ప్రపంచ స్థాయి ఫ్యూజన్ వంటకాల వరకు ముంబైలో లభించే వైవిధ్యం ప్రపంచ ఆహార విమర్శకులను ఆకట్టుకుంది. అలాగే అమృత్‌సర్‌లోని పంజాబీ వంటలు, ఢిల్లీలోని మొఘలాయ్ రుచులు, హైదరాబాద్ బిర్యానీ, హలీమ్, ఇరానీ వంటలు, కోల్‌కతా బెంగాలీ వంటలు, చెన్నై దక్షిణాది సంప్రదాయ రుచులు భారతీయ ఆహార వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

ప్రత్యేకించి హైదరాబాద్‌కు ప్రపంచ టాప్50లో స్థానం దక్కడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది. నిజాం కాలం నుంచి వస్తున్న బిర్యానీ సంప్రదాయం, హలీమ్, పాయా, కబాబ్‌లు, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లు, తెలంగాణ ప్రాంతీయ వంటకాలు ఈ నగరాన్ని ప్రపంచ ఆహార పటంలో ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయని ఆహార నిపుణులు పేర్కొంటున్నారు.

భారతీయ వంటకాల బలం కేవలం రుచిలోనే లేదని, వేల ఏళ్ల సంస్కృతి, ఆయుర్వేద సంప్రదాయం, ప్రాంతీయ వ్యవసాయ ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాల వినియోగం, ఋతువులకు అనుగుణమైన ఆహార పద్ధతులు, కుటుంబ బంధాలను ప్రతిబింబించే వడ్డింపు విధానంలోనూ ఉందని అంతర్జాతీయ ఆహార విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశంలో ప్రతి వంద కిలోమీటర్లకు భాష మారినట్లే వంటకాల రుచి కూడా మారుతుండటం ప్రపంచంలోనే అత్యంత వైవిధ్యమైన ఆహార సంస్కృతిగా భారత్‌ను నిలబెడుతోంది.

ప్రపంచ పర్యాటక రంగంలో ఇప్పుడు "ఫుడ్ టూరిజం" వేగంగా విస్తరిస్తోంది. ఒక నగరాన్ని సందర్శించడానికి అక్కడి చారిత్రక కట్టడాలే కాదు, స్థానిక వంటకాలే ప్రధాన ఆకర్షణగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ టాప్100 ఆహార నగరాల్లో ఐదు భారతీయ నగరాలు చోటు దక్కించుకోవడం భారతీయ ఆహార పరిశ్రమకు, పర్యాటక రంగానికి, హోటల్ రంగానికి మరింత ఊతమివ్వనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశం యోగా, ఆయుర్వేదం, ఆధ్యాత్మికతతో పాటు ఇప్పుడు తన అపారమైన ఆహార వైవిధ్యంతో కూడా ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. ప్రపంచ రుచుల వేదికపై ముంబైతో మొదలైన భారత విజయగాథ, అమృత్‌సర్, న్యూఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నైల ద్వారా మరింత విస్తరిస్తూ... "భారత్ అంటే సంస్కృతి మాత్రమే కాదు... రుచుల మహాసముద్రం కూడా" అనే విషయాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెబుతోంది.

# జీతమంతా అనాథ చిన్నారులకే

**మరోసారి సేవా దృక్పథం చాటిన పవన్ కళ్యాణ్**

**అమరావతి, మహా:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రతి నెల మాదిరిగానే ఈ నెల కూడా తనకు వచ్చిన రూ.2.10 లక్షల జీతాన్ని పూర్తిగా పిఠాపురం నియోజకవర్గంలోని తల్లిదండ్రులను కోల్పోయిన 42 మంది చిన్నారులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. చెక్కుల రూపంలో ఈ మొత్తాన్ని పంపిణీ చేసి వారి విద్య, జీవనోపాధికి అండగా నిలిచారు.

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతి నెల తన జీతాన్ని అవసరమైన వారికి అందజేస్తున్న పవన్ కళ్యాణ్, ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. అనాథ చిన్నారుల భవిష్యత్తుకు చేయూత అందించడాన్ని తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఇక నెల జీతాన్ని 42 మంది చిన్నారులకు పంపిణీ చేయడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మరో ఇద్దరు లబ్ధిదారులకు తన వ్యక్తిగత నిధుల నుంచి అదనపు ఆర్థిక సహాయాన్ని అందించారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు సమాచారం.

ప్రతి నెల తన జీతాన్ని సామాజిక సేవకు వినియోగిస్తున్న పవన్ కళ్యాణ్ చర్యలను జనసేన శ్రేణులు, అభిమానులు అభినందిస్తున్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే నిరుపేదలు, అనాథ చిన్నారుల సంక్షేమానికి వ్యక్తిగతంగా చేయూత అందించడం ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# ఓటీటీలోకి వస్తోన్న సింగ్ గీతం

ప్రయోగాత్మక చిత్రాలకు చిరునామాగా పేరొందిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు రూపొందించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. వైజయంతి మూవీస్ పతాకంపై దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రం గత నెల జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. విభిన్న కథాంశం, సింగీతం మార్క్ కథనం, కొత్త తరహా చిత్రీకరణతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా త్వరలో ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. అందిన సమాచారం ప్రకారం జులై 9 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ఈ చిత్రానికి సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చగా, నటుడు విజయ్ దేవరకొండ, దర్శకుడు కేవీ అనుదీప్, రాహుల్ రవీంద్ర, నివేద పేతురాజ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించి ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. థియేటర్లలో ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఓటీటీలో కూడా మంచి ఆదరణ పొందుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



# ప్రశ్న రావణ్ అరెస్టుపై ట్వీట్ వార్

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో అరెస్టైన యూట్యూబర్ ప్రశ్న రావణ్ అలియాస్ జోసెఫ్ వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఒక కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే మరో కేసులో పోలీసులు అదుపులోకి తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. తాజాగా నాలుగు సార్లు బెయిల్ పొందిన అనంతరం ఐదోసారి కూడా ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఈ అంశం మరింత హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామాలపై నటుడు ప్రకాష్ రాజ్ తీవ్రంగా స్పందించారు. కోర్టులు వరుసగా బెయిల్ మంజూరు చేస్తున్నప్పటికీ మళ్లీ మళ్లీ అరెస్టు చేయడం న్యాయవ్యవస్థను అవమానించడమేనని ఆయన విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణిచివేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల్లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.
ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలకు నిర్మాత, నటుడు బండ్ల గణేష్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ప్రతి అంశంపై అతిగా స్పందించడం సరికాదని, ముందుగా తన వైఖరిని పరిశీలించుకోవాలని ప్రకాష్ రాజ్‌ను ఉద్దేశించి విమర్శించారు. అవసరానికి మించి వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. ఈ ఇద్దరి మధ్య జరిగిన వ్యాఖ్యల యుద్ధం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఒకవైపు ప్రశ్న రావణ్ అరెస్టుల వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, మరోవైపు ప్రకాష్ రాజ్, బండ్ల గణేష్ మధ్య సాగుతున్న మాటల పోరు సినీ వర్గాల్లోనూ ఆసక్తికరంగా మారింది.






# సామ్ సరికొత్త చరిత్ర

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రదర్శనను కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన ఈ చిత్రం దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ భారీ వసూళ్లను నమోదు చేస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా, కమర్షియల్‌గా కూడా సత్తా చాటుతూ సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తోంది.
ప్రతిభావంతురాలైన దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్, ఎమోషనల్ డ్రామాను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమాకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా మంచి స్పందన లభించింది. సమంత నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ముఖ్యంగా ఉత్తర అమెరికా మార్కెట్‌లో ఈ సినిమా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా అక్కడ **2 మిలియన్ డాలర్ల** మార్కును విజయవంతంగా దాటిన ఈ చిత్రం, భారత కరెన్సీలో రూ.16 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారీ విజయాన్ని నమోదు చేసింది. ఒక తెలుగు సోలో ఫీమేల్ లీడ్ సినిమా ఉత్తర అమెరికాలో ఈ స్థాయి వసూళ్లు సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో ఆ మార్కెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి తెలుగు హీరోయిన్‌గా సమంత కొత్త చరిత్ర సృష్టించింది.
ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే **రూ.90.15 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు** నమోదు చేసింది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ స్థిరమైన కలెక్షన్లను కొనసాగిస్తున్న ఈ సినిమా త్వరలోనే ప్రతిష్ఠాత్మక **రూ.100 కోట్ల క్లబ్**లోకి అడుగుపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీకెండ్‌లో మరిన్ని స్క్రీన్లలో మంచి ఆక్యుపెన్సీ నమోదవుతుండటంతో ఈ లక్ష్యాన్ని త్వరలోనే అందుకుంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.
ఈ విజయంతో సమంత మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కిన సినిమా కూడా భారీ కమర్షియల్ విజయాన్ని అందుకోవచ్చని 'మా ఇంటి బంగారం' నిరూపించిందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సమంత కెరీర్‌లో ఈ చిత్రం అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలవడంతో పాటు, ఆమె సినీ ప్రయాణంలో చిరస్మరణీయ మైలురాయిగా నిలిచిపోతుందని అభిమానులు సంబరాలు జరుపుకుంటున్నారు.




# 2027 సంక్రాంతికి వెంకీ–కళ్యాణ్ రామ్ సందడి

సంక్రాంతి అంటే తెలుగు సినీ అభిమానులకు పండుగ మాత్రమే కాదు.. భారీ చిత్రాల సందడి కూడా. ప్రతి ఏడాది మాదిరిగానే 2027 సంక్రాంతి బరిలోనూ మరో భారీ ద్వినాయకుల చిత్రం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా చిత్రంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కళ్యాణ్ రామ్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన తొలి ప్రచార చిత్రంతో ఈ సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ చిత్రం తాత్కాలిక పేర్లతో రూపొందుతోంది. ప్రముఖ నిర్మాత సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా తొలి విడత చిత్రీకరణ ఇప్పటికే హైదరాబాద్‌లో శరవేగంగా సాగుతోంది. అనిల్ రావిపూడి శైలికి తగ్గట్టుగా హాస్యం, కుటుంబ భావోద్వేగాలు, పండుగ వాతావరణం, వినోదాత్మక అంశాల సమ్మేళనంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ప్రచార చిత్రంలో ఆయన పూర్తి స్థాయి పండుగ వాతావరణంలో కనిపించారు. పంచె, కుర్తా ధరించి, మెడలో పూలదండ వేసుకుని, కళ్లకు ఆకర్షణీయమైన నల్ల అద్దాలు పెట్టుకుని ఉత్సాహంగా నృత్యం చేస్తున్న ఆయన రూపం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒక్క ప్రచార చిత్రంతోనే సినిమాలోని పండుగ సందడి ఎలా ఉండబోతుందో చిత్రబృందం చూపించింది. ఇదే సందర్భంగా కళ్యాణ్ రామ్ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాను కూడా ప్రారంభించారు. తొలి సందేశంగానే ఈ సినిమా ప్రచార చిత్రాన్ని అభిమానులతో పంచుకుంటూ.. "అనిల్ రావిపూడితో కలిసి పని చేయడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. 2027 సంక్రాంతికి ఒక అద్భుతానికి సిద్ధంగా ఉండండి" అని పేర్కొన్నారు. ఈ సందేశం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో వెంకటేష్ మరో కీలక పాత్రలో కనిపించనుండగా, కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఇద్దరు హీరోలకు సమాన ప్రాధాన్యం ఉండేలా కథను అనిల్ రావిపూడి తీర్చిదిద్దినట్లు సమాచారం. సంగీతాన్ని జీవీ ప్రకాష్ కుమార్ అందిస్తుండగా, ఛాయాగ్రాహకుడిగా సమీర్ రెడ్డి, కూర్పు బాధ్యతలను తమ్మిరాజు, కళా దర్శకుడిగా ఎ.ఎస్. ప్రకాష్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అనిల్ రావిపూడి రూపొందించిన సంక్రాంతి చిత్రాలు ప్రేక్షకాదరణ పొందిన నేపథ్యంలో, వెంకటేష్-కళ్యాణ్ రామ్ కలయికతో వస్తున్న ఈ చిత్రం కూడా పూర్తి స్థాయి కుటుంబ వినోద చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పండుగకు కావాల్సిన వినోదం, హాస్యం, భావోద్వేగాలు అన్నీ సమపాళ్లలో ఉండనున్న ఈ చిత్రం 2027 సంక్రాంతి సందర్భంగా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.





# ఫ్యాషన్‌తో ఫిదా చేసిన రిద్ధి

యువ నటి రిద్ధి కుమార్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంది. సింపుల్ ఫ్యాషన్‌ను రంగుల హంగులతో మేళవిస్తూ యువతకు సరికొత్త స్టైల్ స్టేట్‌మెంట్‌ను అందించింది.తెల్లటి ఫిటెడ్ ట్యాంక్ టాప్‌కు ఎరుపు తెలుపు గింగమ్ మినీ స్కర్ట్‌ను జత చేసి క్యాజువల్ లుక్‌లో మెరిసింది. మినిమలిస్టిక్ వైట్ బ్యాక్‌డ్రాప్ ముందు కాన్ఫిడెంట్ పోజ్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయింది. మెస్సీ అప్‌డో హెయిర్‌స్టైల్, ముత్యాల నెక్లెస్, తెల్లటి బ్యాంగిల్స్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.'లవర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రిద్ధి కుమార్, ఆ తర్వాత పలు భాషల్లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 'హ్యూమన్', 'క్రాష్ కోర్స్' వంటి వెబ్ సిరీస్‌లతో పాటు పలు సినిమాల్లోనూ తన ప్రతిభను చాటుకుంది.ఇటీవల విడుదలైన 'సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్' (2025) చిత్రంలో మల్లిక పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు లభించాయి. చిన్న పట్టణాల సినీ కలలను ఆవిష్కరించిన ఈ హిందీ చిత్రంలో రిద్ధి నటన ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది.

# 'నో' చెప్పడం నేర్చుకోవాలి: కాజల్ అగర్వాల్

దాదాపు రెండు దశాబ్దాలుగా తెలుగు, తమిళం, హిందీ చిత్ర పరిశ్రమల్లో తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్, త్వరలో 'ది ఇండియా స్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన సినీ ప్రయాణం, కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న సవాళ్లు, నేటి తరం నటీనటులు ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు, అలాగే తన వ్యక్తిగత విలువల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు.
తన తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ' గురించి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, సమాజంలో చర్చకు రావాల్సిన అత్యంత కీలకమైన అంశాన్ని ప్రస్తావించే చిత్రం అని తెలిపారు. ఈ సినిమా కోసం చేసిన పరిశోధనలో దేశంలోని ఆహార భద్రతకు సంబంధించిన అనేక వాస్తవాలు తనకు తెలిసాయని చెప్పారు. కథ చదివిన తర్వాత ఆ ప్రభావంతో తన వ్యక్తిగత, కుటుంబ జీవనశైలిలో కూడా కొన్ని మార్పులు చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అంశాన్ని ఈ సినిమా ముందుకు తీసుకొస్తుందని, ప్రేక్షకుల్లో అవగాహన పెంచుతుందనే నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు.కెరీర్ ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్న కాజల్, అప్పటి చిత్ర పరిశ్రమ ఇప్పటితో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉండేదని చెప్పారు. సామాజిక మాధ్యమాలు లేని కారణంగా బహిరంగ విమర్శలు తక్కువగా ఉండేవని, అయితే నటీనటుల రూపురేఖల విషయంలో మాత్రం కఠినమైన నిబంధనలు ఉండేవని గుర్తు చేశారు. కొందరు దర్శకులు పాత్రల కోసం బరువు పెరగాలని, మరికొందరు తగ్గాలని సూచించేవారని తెలిపారు. అయితే ఆ రోజుల్లో వచ్చే సూచనలు పరిమితుల్లోనే ఉండేవని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు.ప్రస్తుతం యువ నటీనటులు ఎదుర్కొంటున్న ఒత్తిడి చాలా ఎక్కువగా ఉందని కాజల్ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో నిరంతరం ట్రోలింగ్, విమర్శలు, వ్యక్తిగత దూషణలు ఎదుర్కోవాల్సి వస్తోందని, అలాంటి పరిస్థితుల్లో మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమని సూచించారు. ప్రతికూల వ్యాఖ్యలను పట్టించుకోకుండా తమ లక్ష్యంపై దృష్టి పెట్టాలని యువతకు ఆమె సూచించారు.
గ్లామర్ ప్రపంచంలో ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటే అవసరమైన చోట 'నో' చెప్పడం నేర్చుకోవాలని కాజల్ అన్నారు. ప్రతి అవకాశాన్ని అంగీకరించాల్సిన అవసరం లేదని, మన విలువలకు విరుద్ధంగా ఉండే పాత్రలను ధైర్యంగా తిరస్కరించాలని సూచించారు. ఒక అవకాశం కోల్పోయినా, దానికంటే మంచి అవకాశం తప్పకుండా వస్తుందనే నమ్మకంతో ముందుకు సాగాలని చెప్పారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.11562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com